
ప్రజాశక్తి
ఆదివారం 30 జులై 2023
12 పేజీలు



తిరుపతి



చిత్తూరు

పులులను సంరక్షిస్తేనే అటవీ సంపదకు రక్షణ

అంతర్జాతీయ పులుల దినోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్: పులుల సంఖ్య పెరిగితే అటవీ సంపదకు రక్షణ ఉంటుందని రాష్ట్ర విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. 2010లో 45 పులులు ఉంటే నేడు రెట్టింపుతో 80కి పెరిగాయన్నారు. రాష్ట్రం పులుల సంరక్షణలో గణనీయంగా అభివద్ధి సాధించిందని, శేషాచల, నల్లమల అభయారణ్యాలను కలుపుతూ కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 50 వ గ్లోబల్ టైగర్ డే వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. శనివారం ఉదయం స్థానిక ఎస్వీ జూ పార్క్ లో గ్లోబల్ టైగర్ డే వేడుకల కు రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ పులుల సంరక్షణకు రష్యాలోని జరిగిన సమావేశంలో బీజం పడిందని ఆనాటి నుండి ప్రతి ఏడాదీ జులై 29న గ్లోబల్ టైగర్ డే జరుపుకుంటున్నా మని అన్నారు. శేషాచల అభయారణ్యం లో నేడు పెద్ద పులులు లేవని అయితే మామండూరు వద్ద గెస్ట్ హౌస్ నందు బ్రిటిష్ వారు వేటాడినట్లురికార్డ్స్ చెబుతున్నాయని అందుకే నల్లమల, శేషాచల అభయారణ్యం లు కలుపుతూ కారిడార్ ఏర్పాటుతో నల్ల మలలో వున్న పెద్ద పులులు ఇక్కడికి రావడానికి వీలుంటుందని అన్నారు. చిరుతలు, పెద్దపులులు ఉండేవిధంగా ఏర్పాటు తో అటవీ సంరక్షణ కు దోహదపడుతుంది అన్నారు. శ్రీశైలం నాగర్జునసాగర్ టైగర్ జోన్ ఇప్పుడు 8 లక్షల ఎకరాల్లో వుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో 5 లక్షల ఎకరాలు జోన్ పరిధి పెంచేలా ప్రతిపాదనలు చేశారని అన్నారు. ఎన్ఎస్ టి ఆర్ పుస్తకం, పోస్టర్ ఆవిష్కరణ చేశారు. వివిధ వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అటవీ సంరక్షణ లో ప్రతిభ కనబరిచిన అటవీ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎస్వీ జూ పార్క్ లో పర్యాటకులకు కొత్తగా ఎర్పాటు చేసిన బజాజ్ బ్యాటరీ స్కూటర్ లను జెండా ఊపి ప్రారంభించారు. అటవీ అధికారులు ఉపయోగించే ఆయుధాల స్టాల్స్ పరిశీలించారు. చంద్రగిరి ఎంపిపి మోహిత్ రెడ్డి, పిసిసిఎఫ్ మధుసూధన్ రెడ్డి, అడిషనల్ పిసిసీఎఫ్ శాంతిప్రియ పాండే, సీసీఎఫ్ నాగేశ్వర రావు, జూ పార్క్ క్యూరేటర్ సి. సెల్వం, స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోదా బాయ్, తిరుపతి డిఎఫ్ఓ సతీష్ రెడ్డి పాల్గొన్నారు.



దశ శత దినాలు..
ఫారెస్టోళ్ల పోరాటం..!
8లో

పేదలకు అందని ద్రాక్షగా టమోటా

ప్రజాదృష్టి

జిల్లాలో టమోటా పంట విస్తారంగా సాగు అవుతోంది. సీజన్లో ఎంతో లాభసాటిగా ఉంటున్న టమోటా పంటను రైతులు లక్షలు ఖర్చు పెట్టి పండిస్తున్నారు. ధరలున్న సమయంలో కోతకు రావడంతో కొంత మంది రైతులు లాభాలు పొందుతున్నారు. అయితే ఎక్కువ శాతం రైతులు పంటపై మందులు సరిగా పనిచేయకపోవడం, నకిలీ విత్తనాల మోసం కారణంగా నష్టపోతున్న పరిస్థితి. టమోటా సాగులో ప్రతి సంవత్సరం ఇదే తంతు..



గత ఆరె నెలల కాలంలో టమోటా పంట విస్తారంగా పండింది. టమోటాకు వ్యాపారస్తులు, ప్రభుత్వం నుంచి సరైన గిట్టుబాటు ధర లేక రైతులు టమోటాలను రోడ్లపై పారపోసి నిరసన తెలిపిన పరిస్థితులను జిల్లాలో చూశాం. అయితే నేడు పంట దిగుబడి తక్కువ కావడంతో అమాంతంగా టమోటా ధర పెరిగి సామాన్య, పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. టమోటా ధరలు రోజురోజుకి ఆకాశాన్ని అంటుతున్నాయి. రికార్డు స్థాయిలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా టమోటా ధర రూ.200లకు చేరింది. జిల్లాలో అతి తక్కువ మంది రైతులకు అతి తక్కువ దిగుబడితో పంట ఉంది. జిల్లా చరిత్రలోనే టమోటా దొంగతనాలు చేసిన పరిస్థితి లేదు.. ప్రస్తుతం ధర అందుబాటులో లేకపోవడంతో రాత్రులలో సోమల, సదుం, చౌడేపల్లి, తదితర మండలాల్లో దొంగతనాలు జరుగుతున్న చూస్తున్నాం.

ప్రజలు టమోటా ఎక్కువగా వాడేవారు. ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ నేడు పేదల టమోటా ధర కొండెక్కి కూర్చోవడంతో జిల్లాలో ప్రజలు ఎవరూ కూడా టమోటా వాడే పరిస్థితి లేదు. ప్రభుత్వం జోక్యం చేసుకొని టమోటాలు కొని సబ్సిడీ రూపంలో పేదప్రజలకు అందజేసి వారి ఆరోగ్య కాపాడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. పేదల కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు ఉండడం సరైనది కాదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రభుత్వం స్పందించి పేదలకు అందుబాటులో ఉండే విధంగా టమోటాలు సరఫరా చేయాలి.

- విజిఆర్

రాయలసీమకు బిజెపి చేసిన ద్రోహాన్ని వ్యతిరేకిస్తూ

31న కలెక్టరేట్ వద్ద ధర్నా

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పార్లమెంట్లో రాతపూర్వకంగా చెప్పడాన్ని నిరసిస్తూ 31న కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ధర్నా జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు కోరారు. శనివారం చిత్తూరులో కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ స్థాపించడం సాధ్యం కాదని బిజెపి ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రభుత్వరంగంలో లాభదాయకం కానీ ఈ ఉక్కు పరిశ్రమ ప్రైవేటు జిందాల్ కంపెనీకి ఎలా లాభదాయకం అవుతుందో బిజెపి చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారానికి పోటీపడుతున్న వైసిపి, టిడిపిలు పరిశ్రమను సాధించడంలో ఘోరంగా విఫలమైనారని విమర్శించారు. తమ పార్టీకి 25మంది ఎంపీలు ఇస్తే కేంద్రం మెడలు వంచి సాధిస్తానని చెప్పి జగన్ మోహన్‌రెడ్డి కేంద్రం ముందు నడుముల వంగి సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నారన్నారు. 2018లో కడప ఉక్కు పరిశ్రమ కోసం ఆమరణ దీక్షలు చేసిన టిడిపి నేడు మౌనంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదు కాదు పది సంవత్సరాలు కావాలని అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేకహోదాతో పాటు విభజన చట్టంలోని అంశాలను అమలుపరుస్తామని బిజెపి హామీ ఇచ్చింది. దానిని ఇప్పుడు తుంగలో తొక్కుతున్నది. విభజన చట్టం ప్రకారం కడప ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలో నిర్మించాలి కానీ బిజెపి మొదటి నుంచి ఈ పరిశ్రమ స్థాపనపై మోసపూరిత వైఖరి అనుసరిస్తున్నదని ఇప్పటికైనా ప్రతిపక్ష, అధికార పార్టీ ప్రశ్నించాలని కోరారు. వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విభజన చట్టంలో భాగంగా కడప స్టీల్ ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని 31న జరిగే కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు సురేంద్రన్ పాల్గొన్నారు.

రాజగోపురానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగర పరిధిలోని తోటపాళ్యం 40వ డివిజన్ ప్రజలు, రజకుల కోరిక మేరకు నీవానది ఒడ్డున వెలసిన రజకుల కులదైవమైన అతి పురాతన వీరభద్రస్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి జిజెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ ఛైర్మెన్ గురజాల జగన్ మోహన్ లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. శనివారం బీవిరెడ్డి కాలనీలో తమ నివాసం వద్ద రజకులకు, ఆలయ నిర్వాహకులకు ఆయన విరాళాన్ని అందించారు. అనంతరం జగన్ మోహన్‌ను ఘనంగా సన్మానించారు.



హెచ్‌పిబి సర్టిఫికెట్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతం



తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం, ఇండియన్ చాప్టర్ ఆఫ్ ఇంటర్నెషనల్ హెపటో పాంక్రియాటో బిలయరీ అసోసియేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో హెచ్.పి.బి. సర్టిఫికెట్ ట్రైనింగ్ ప్రొగ్రామ్- 2023, ఈ నెల 25 వ తేది నుండి 29 వరకు 5 రోజుల పాటు జరిగిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టరు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసింది. శ్రీ పద్మావతి ఆడిటోరియంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైద్య సంస్థలకు చెందిన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగపు వైద్య నిపుణులు 58 మంది హాజరయ్యారు. దేశంలోని వివిధ ప్రముఖ వైద్య సంస్థల నుంచే కాక బంగ్లాదేశ్ నుంచి వచ్చిన గాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు ఈ కార్యక్రమంలో లివర్, పాంక్రియాటిస్, గాల్ బ్లాడర్, బైల్ డిటెక్టర్ తదితర అంశాలపై ఆధునిక వైద్య చికిత్స ప్రక్రియలపై విస్తతంగా చర్చించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 65 మంది పి.జి. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. డాక్టరు శివరామకష్ణ, డాక్టరు చంద్రమౌళీటీశ్వరన్, డాక్టర్ బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అభినయ ఆర్ట్స్ (హనుమ అవార్డ్సు) 23వ వార్షికోత్సవాల్లో భాగంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, ఆంధ్రరాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి, టిటిడి హిందూ ధర్మాప్రచార పరిషత్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆలోచింప చేస్తున్నాయి. స్థానిక మహతి ఆడిటోరియంలో జరుగుతున్న జాతీయ స్థాయి పద్యనాటకములు, సాంఘీక నాటికలు, కూచిపూడి, భరత నాట్య, జానపద బృంద నృత్య పోటీలలో భాగంగా శనివారం పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కూచిపూడి, భరత నాట్యం, జానపద బృందం, సోలో నృత్య పోటీలలో బాగంగా అనేక మంది నృత్యకారులు తమ పలు రకాల పాటలకు నృత్యించి ప్రేక్షకులను మెప్పించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు విజయవాడకు చెందిన సంస్కార భారతి ఆధ్వర్యంలో దర్శకులు డాక్టరు పివిఎన్.కృష్ణ రచించిన 'మాధవ వర్మ' పద్యనాటకాన్ని డాక్టరు రామన్ ఫౌండేషన్ సాయిబాబా నాట్య మండలి కళాకారులు ప్రదర్శించారు. సాయంత్రం 6 గంటలకు ఏలూరుకు చెందిన హేలాపురి కల్చరల్ అసోసియేషన్ కళాకారులచే పి.కృష్ణ హితేజ్, సిహెచ్ మల్లేశ్వరరావు రచించిన 'మనసున మనసై' సాంఘీక నాటికను ప్రదర్శించారు. దీనికి మహ్మద్ ఖాజావల్లి దర్శకత్వం వహించారు. రాత్రి 7 గంటలకు కత్తి శాంప్రసాద్ దర్శకత్వం వహించి, మునిపల్లె విద్యాదర్ రచించిన 'స్వర్ణ కమలాలు' సాంఘీక నాటికను విజయవాడకు చెందిన హర్ష క్రియేషన్ కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. కళాకారులు తమ నటనా అబినయంతో మానవీయ బందాలు, భార్యభర్తల మధ్య ఉండాల్సిన అనురాగాలు, కుటుంబ సభ్యుల్లో లోపించిన అప్యాయతలను కళ్లకు కట్టినట్లు చూపించారు. ఎదుట వారిని గౌరవించడం, తోటి వారికి సహాయపడడం వంటి అనేక మానవీయదృకృథం కల్గిన అంశాలను తమ నాటక ప్రదర్శనల ద్వారా ప్రదర్శించి, ప్రేక్షకులను అలరింప చేశారు. ఈ కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ అధ్యక్షులు మబ్బు సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బిఎన్.రెడ్డి, ముఖ్య సలహాదారులు విజయకుమార్ పాల్గొన్నారు.


ఎన్‌సీసీ విద్యార్థులకు హెల్ప్‌లైన్ -139

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతిలో జరిగిన ఎన్‌సిసి విద్యార్థులకు హెల్ప్‌లైన్ నంబర్.139 కార్యక్రమంలో ఆర్‌పిఎఫ్‌సిఐ కె మధుసూదన్ అవగాహన కల్పించారు. శనివారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కెరియర్ గైడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ నేర్చుకోవాల్సిన అవసరం గురించి ప్రసంగించారు. రైల్వే టోల్ ఫ్రీ నంబర్లు 139, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సఖి 181మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు. నాయకత్వ గుణాలను నేర్చుకోవడానికి, జీవితంలో కష్టాలను ఎదుర్కోవడంలో శారీరక, మానసిక బలాన్ని ఎలా పెంచుకోవాలో చెప్పారు. మహిళా కానిస్టేబుల్ కె శైలజ, మాట్లాడుతూ సమాజంలో బాలికల సాధికారత గురించి, జీవితంలోని ఆశయ సాధన గురించి వివరంగా వివరించారు.



'మట్టి వాసన' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విజయం డిగ్రీ కళాశాల ఆవరణంలో శనివారం చిత్తూరు బౌద్ధదమ్మ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కట్టమంచి బాలకష్ణారెడ్డి అధ్యక్షతన రఘురాం రామస్వామి రచనలు మట్టి వాసన, లాస్ట్ బెంచ్ పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. అధ్యక్షులు మాట్లాడుతూ కవులు, రచయితలు తమ సాహిత్య రచనలు భాషాభివద్ధికి, సమాజానికి మేలుకొలుపుగా ఉండాలని తెలుపుతూ రఘుపతి రామస్వామి రచనలు పల్లె జీవనము, బాల్య జీవితం అనుభవము రంగరించి చక్కటి రచనలు చేసినందుకు అభినందనలు తెలియజేశారు. అనంతరం డాక్టర్ రామలక్ష్మి మాట్లాడుతూ నేటి సమాజానికి ఉపయుక్తమయ్యే ఆరోగ్యవంతమైన రచనలు చేయాలని తెలుగు భాషలో సంరక్షించుకోవడానికి కషి చేయాలన్నారు. మట్టివాసన బాల్యంలో తీపి గుర్తులు అన్నారు. తేజమూర్తి, తులసీనాథం నాయుడు, ఎంఆర్.అరుణ కుమారి, కేశవులు, చక్రధర్ తమిళనాడు నుంచి విచ్చేసిన తమిళ రచయిత ఎన్.పెరియస్వామి పాల్గొన్నారు.



నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ప్రతి నెలా చివరి ఆదివారం జైన్ సంఘం నేతృత్వంలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు జౌన్ సంఘం ప్రతినిధులు సుభాష్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అరవిందో కంటి వైద్యనిపుణులు ఆదివారం వైద్యపరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు ఎంపికైన వారికి ఉచితంగా రవాణా ఖర్చులతో ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. కంటిఅద్దాలు అవసరమైన వారికి ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని కంటి సమస్యలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు.

మృతదేహం లభ్యం



శివకుమార్ (పాత చిత్రం)

ప్రజాశక్తి-పులిచెర్ల: మూడు నెలల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం మండలంలోని జ్యోతి నగర్ వెనుక భాగాన ఉన్న అటవీ ప్రాంతంలో లభ్యమైనట్లు కల్లూరు ఎస్సై రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... పులిచెర్ల మండలం, చల్లావారిపల్లెకు చెందిన శివకుమార్ (31) అదే గ్రామానికి చెందిన రేఖతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివకుమార్ సుమారు మూడు నెలల క్రితం తనకు కొంత డబ్బు అప్పుగా తెచ్చి ఇవ్వాలని భార్య సురేఖను కోరాడు. దీనికి భార్య సురేఖ నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన శివకుమార్ మే నెల 10వ తేదీన ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. భార్య సురేఖ తన కుటుంబ సభ్యులతో కలిసి చుట్టుపక్కల వెతికింది. శివకుమార్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో మే నెల 28వ తేదీన కల్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కల్లూరు పోలీసులు అప్పట్లో మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో జ్యోతి నగర్ సమీపంలో పశువుల మేతకు వెళ్లిన రైతులు శనివారం మృతదేహాన్ని గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కల్లూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. దీంతో మే నెల 28న మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన శివకుమార్ బంధువులను పిలిపించారు. మృతదేహం వద్ద ఉన్న బట్టలు, చెప్పులు, ద్విచక్ర వాహనాన్ని చూసి శివకుమార్ గా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు.

దౌర్జన్యాన్ని అడ్డుకోవడమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి దౌర్జన్యాన్ని అడ్డుకోవడమే టిడిపి లక్ష్యం అని టిడిపి నాయకులు అన్నారు. శనివారం వెదురుకుప్పం టిడిపి దళిత నాయకులు, వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని తిప్పినాయుడు పల్లి గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి అనే రైతు సుమారు 40 మామిడి చెట్లను స్థానిక సర్పంచ్ జేసీబీతో తీయించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ ఆ రైతుని పరామర్శించడానికి వచ్చిన సందర్భంలో స్థానిక సర్పంచ్ టిడిపి శ్రేణులకు అడ్డంగా ట్రాక్టర్ పెట్టి ఎందుకు వచ్చారంటూ దౌర్జన్యం చేశారు. ప్రభుత్వ భూమి సుమారు మూడు ఎకరాలు ఉంటే గోపాల్ రెడ్డి చెట్లు పెట్టిన 40 సెంట్లు స్మశానానికి అవసరమా? ఈ వైసిపి చోటా నాయకుడికి మిగతా 2.60 ఎకరాల స్థలం ఉంటే అక్కడ స్మశానం పెడితే ఎవరైనా వద్దన్నారా? రైతుల పైన దగా చేయడం ఈ నాయకులకు తగునా అంటూ టిడిపి నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో మండల దళిత నాయకులు వరప్రసాద్, రజనీకాంత్, కార్తీక్, కుమార్, రాజగోపాల్, మురళి, వెంకటేష్, యుగంధర్, పాల్గొన్నారు.

పంట పొలాలపై గజరాజుల దాడి



పంట పొలాలను పరిశీలిస్తున్న బీట్ ఆఫీసర్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: పంట పొలాలపై గజరాజుల దాడి చేసి రైతులకు నష్టం కలిగించిన సంఘటన మండలంలోని పాతూరు నాత్తం గ్రామ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రైతు పలని (టమోటా) తోట, కష్టప్ప (టెంకాయ చెట్లు) 4, జయరాం (టెంకాయ చెట్లు) 20, మునస్వామి అరటి, టెంకాయ చెట్లు, రఫీ బీచ్ 20 సెంట్లు ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న తోటకనుం బీట్ ఆఫీసర్ కుసుమ సంఘటనా స్థలానికి చేరుకొని ధ్వంసమైన పంట పొలాలను పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గజరాజులను పంట పొలాల వైపు రాకుండా చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

జగనన్న గోరుముద్ద కార్మికుల సంక్షేమానికి తూట్లు

ప్రజాశక్తి-నగరి: జగనన్న గోరుముద్ద కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడుస్తున్న జగన్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటానికి మహిళా కార్మికులకు సన్నద్ధం కావాలని ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య పిలుపునిచ్చారు. శనివారం నగరి మండల పరిధిలోని మధ్యాహ్న భోజనం వర్కర్స్ సమావేశం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆ యూనియన్ నాయకులు కష్టవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. ఏఐటియూసీ నాయకులు వేలన్, ఏఐవైఎఫ్ నగరి నియోజకవర్గం అధ్యక్షులు హరీష్, మధ్యాహ్న భోజన పథకం మండల కార్యదర్శి జమున, అధ్యక్షులు కష్ట వేణి పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కాలిపోయిన కారు

ప్రజాశక్తి-గంగవరం: బెంగళూరు-చెన్నై రహదారిలో నిలచి ఉన్న కారులో ఒక్క సారిగా మంటలు రావడంతో కారులో ప్రయాణిస్తున్న వారితో సహ చుట్టు పక్కల వారు భయాందోళనకు గురైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. .బెంగళూరుకు చెందిన హేమంత్ తన భార్యతో కలిసి తిరుమల వెళ్లి తిరుగు ప్రయాణంలో శనివారం పున్నమకనపల్లి గ్రామం వద్ద కారు పంక్చర్ అవడంతో ఆపి పక్కన పంక్చర్ వేయిస్తుండగా ఒక్క సారిగా కారులో మంటలు రావడంతో భార్య స్వర్ణను హుషారుగా కార్లో నుండి దింపేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. అసలు ఏమి జరిగిందో కూడా తెలియకుండా కారు ఒక్కసారిగా అంటుకోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని, ఏది ఏమైనా రెండు నిండు ప్రాణాలకు ప్రాణాపాయం తప్పిందని హేమంత్ అంటున్నారు.

ఎంపీపీని కలిసిన వార్డెన్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా టి.మురళి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన ఇంతకుముందు వరదయ్యపాలెం మండలంలోని సంత వేలూరు హాస్టల్లో వార్డెన్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మండల ఎంపీపీ మొగసాల రెడ్డెప్పను గౌరవంగా కలిసి కండువా కప్పి పూలమాలవేసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతూ హాస్టల్లో ఉన్న విద్యార్థులకు తల్లి తండ్రి మీరేగా ఉంటూ, వారిని సురక్షితంగా చూసుకోవాలని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు విద్యలో ఉన్నత స్థాయికి చేరుకునేలా మీ వంతు సహకారం అందిస్తూ, వారికి ఎలాంటి లోటు రాకుండా చూసుకొని బైరెడ్డిపల్లి హాస్టల్లో చదివిన విద్యార్థులు వారు ఉన్నంతవరకు మన హాస్టల్ పేరు గుర్తుంచుకుండేలా చూసే బాధ్యత మీ పైన ఉందని తెలిపారు.

Before The VII Addl. Motor Accidents Claims Tribunal : Gudur
M.V.O.P.No. 534 / 2014

Akharapaka Samudraiah - Claimant
Vs
1. **M/s. Thirumala Milk Products (P) Ltd.**, Rep., by M.D. resident of D.No.435, "W" Block, V Street, Annanager West Extention, Chennai-600101.
2. **Oriental Insurance Co., Ltd.,** Rep., by Its Branch Manager, Dargamitta, Nellore Town. - Respondents

Notice

To,
Akharapaka Samudraiah, S/o **Polaiah,** Resident of Kallurukandriga Village, Doravarisatram Mandal, Earstwhile Nellore District. Presently Tirupathi District.

Please take Notice that the above O.P. stands posted to 11-08-2023 after allowing I.No. 203/2019 for setting aside the exparte Decree dated 2-1-2017, for notice to you.

You are required to attend the Tribunal on 11-08-2023 either in person or through you advocate to get ready with the claim application afresh on that day, failing which the matter will be heard in you absence. Hence attend the Court by 10-00 AM without fail and represent the same. This is for your information.

Date of hearing 11-08-2023 at about 10-00 AM.

N.Kodanda Rami Reddy, B.Sc., B.L.,
Advocate for the 2nd Respondent, Nellore.

IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE, GUDUR
O.S.No. 156 of 2016

YARAGATUPALLI LALITHA VANI - Plaintiff
Vs.
(1) **PEMMASANI CHARITHA**
(2) **GUTTA PAVAN KUMAR**-Defendants

To
GUTTA PAVAN KUMAR, S/o **Srinivasulu Naidu,** 2-98, Reddypalli Village & Post, VEDURUKUPPAM Mandalam, CHITTOOR DISTRICT.

SUIT NOTICE

Whereas the Plaintiff has instituted a suit against the Defendants for specific performance of the suit agreement of sale, you are hereby summoned to appear in this Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the **28 day of AUGUST 2023 at 10-30 a.m.** O'clock in the fore noon to answer the claim and as the day fixed for your appearance is appointed for the final disposal of the suit, you must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to rely in support of your defence and file written statement within 30 days there from. Take notice that in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.

P. RAGHU RAMI REDDY, M.Sc., LL.M.,
ADVOCATE FOR THE PLAINTIFF NELLORE.

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A.No. 20 of 2019
O.S.No. 44 of 2019

Between:
K.S.Balaji ...Petitioner/Plaintiff
And:
M.Nagaraja ...Respondent/Defendant

NOTICE TO RESPONDENT

To:
M.NAGARAJA
S/o M.Rajanna,
D.No.15-2810/1,
1st Street,1st Cross,
Bharathi Nagar,Chittoor
Sir

Please take notice that above case is posted to **07.08.2023** for your notice and appearance at 10-30 A.M,before the above said court. You may appear either in person or through an advocate and file you objection if any, failing which the matter will be decided exparte.

Sd/-V.ELUMALAI,B.A.,L.L.B.,
Advocate for Petitioner/Plaintiff
Chittoor, Date.29-07-2023

జనరల్ నోటీసు
ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A. No. 271/2021
ఇన్
OS : 98/2021

సింగుకొల్లి హనుమంతప్రసాద్ ....వాది
వర్సెస్
జిల్లా సత్యనారాయణ మరియు ఇంకొందరు .... ప్రతివాదులు

To
జులకంటి గీత,
W/o. జనార్ధన గుప్తా,
D/o. లేట్ కోటేశ్వరరావు,
బజారు వీధి, శ్రీకాళహస్తి,
చిత్తూరు జిల్లా - 517641

పై నెంబరు ఇంటర్ లోకేటరీ అప్లికేషన్ లో మీ నోటీసు నిమిత్తము ఎన్ని సార్లు నోటీసు పంపినా, నోటీసు చేరనందున శ్రీకోర్టు వారు ఈ ప్రజాశక్తి పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఈ ప్రకటన చూసిన తరువాత తేది.08-08-2023 ఉదయం 10.30 లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరై మీయొక్క సమాధానం తెలుపుకొనవలసినది. లేని యెడల పైతెలిపిన ఇంటర్ లోకేటరీ అప్లికేషన్ అన్నీ మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు
తేది : **26-07-2023.** ఇట్లు
పంగులూరు గోవిందయ్య
Reg No 943/1987
అడ్వకేట్,ఒంగోలు
ప్రకాశం జిల్లా

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
O.S.No. 44 of 2019

Between:
K.S.Balaji ...Plaintiff
And:
M.Nagaraja ...Defendant

SUMMONS TO DEFENDANT

To:
M.NAGARAJA
S/o M.Rajanna,
D.No.15-2810/1,
1st Street,1st Cross,
Bharathi Nagar,
Chittoor
Sir

Please take notice that above case is posted to **07.08.2023** for your notice and appearance at 10-30 A.M,before the above said court. You may appear either in person or through an advocate and file you objection if any, failing which the matter will be decided exparte.

Sd/-V.ELUMALAI,B.A.,L.L.B.,
Advocate for the Plaintiff
Chittoor, Date.29-07-2023

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE OF TIRUPATI
I.A.No. 277 / 2021 I.P. No. 25 / 2019

Between:
M.Krishna Kumari ***...Petitioner / Petitioner***
and
C.Ankamma (Died) & 2 others
... Respondents / Resondents

NOTICE TO THE PROPOSED RESPONDENT NO.3

To C.Suresh, S/o C.Kamu Naidu, Plot No.58, Sai Meghana Layout, Mangalam Road, Opp: Reddy Bhavan, Thimminaidupalem, Tirupati Urban & District.

Please take notice that the petitioner filed the above I.P. Against C.Ankamma and another for committing act of Insolvency and after death of said C.Ankamma, the petitioner filed the above I.A. to bring you on record as LR of said late C.Ankamma. The matter is posted for your appearance before the above said Hon'ble Court in the above petition on 14-08-2023 at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear before the Hon'ble court on that date, the matter will be decided in your absence as ex-Parte.

Hearing Date: 14-08-2023, **Time :** 10.30 AM
(By Order of the Court)

M.N.MANI, B.A.L., B.L.,
Advocate for Petitioner / Petitioner

జనరల్ నోటీసు
ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS : 98/2021

సింగుకొల్లి హనుమంతప్రసాద్ ....వాది
వర్సెస్
జిల్లా సత్యనారాయణ మరియు ఇంకొందరు .... ప్రతివాదులు

To
జులకంటి గీత,
W/o. జనార్ధన గుప్తా,
D/o. లేట్ కోటేశ్వరరావు,
బజారు వీధి, శ్రీకాళహస్తి,
చిత్తూరు జిల్లా - 517641,

పై నంబరు దావాలో మీ నోటీసు నిమిత్తము ఎన్ని సార్లు నోటీసు పంపినా, నోటీసు చేరనందున శ్రీ కోర్టు వారు ఈ ప్రజాశక్తి పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఈ ప్రకటన చూసిన తరువాత తేది. 08-08-2023 ఉదయం 10.30 లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగాగాని, అడ్వకేటు ద్వారా గాని హాజరై మీయొక్క సమాధానం తెలుపుకొనవలసినది. లేని యెడల పై తెలిపిన దావాలో అన్నీ మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలంగా మీకు తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు
తేది : **26-07-2023.** ఇట్లు
పంగులూరు గోవిందయ్య
Reg No 943/1987
అడ్వకేట్,ఒంగోలు
ప్రకాశం జిల్లా

నగరిలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలుపుతున్న రోజా

ప్రజాశక్తి-నగరి: మునిసిపాలిటీలోని ఎంపీడీవో సచివాలయం పరిధిలో గల 27వ వార్డులో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండల స్థాయి అధికారులతో కలిసి గడప గడపకు వెళ్లి వారికి వైసీపీ ప్రభుత్వంలో గత 4 సంవత్సరాల నుంచి అందించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను, వారి వారి కుటుంబాల వారీగా పొందిన లబ్ధిని కరపత్రం అందించి సవివరంగా వివరించారు. గత ప్రభుత్వంలో అధికారం కోసం పథకాలు ప్రవేశపెట్టి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, కానీ జగనన్న ఇచ్చిన మాట కోసం ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదుర్కొని, ఈ పథకాలను అమలుపరిచారని తెలిపారు. కరోనా మహమ్మారి, గత ప్రభుత్వం వదిలి వెళ్ళిన అప్పులు, ప్రకతి బీభత్సాన్ని సైతం తట్టుకొని ప్రజలకు మేలు చేస్తున్న జగన్ అన్న మంచి మనసు, దూరదష్టి మరెవ్వరికీ లేదని తెలియజేశారు. కార్యక్రమంలో నగరి మున్సిపాలిటీ ఛైర్మన్, కమిషనర్, డీఈ, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు, వైసీపీ ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు



ఎంపీపీకి పూలమాల వేసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని బైరెడ్డిపల్లి మండల అధ్యక్షులు మొగసాల రెడ్డప్ప జన్మదినం సందర్భంగా శనివారం ఎమ్మెల్సీ భరత్, వైసీపీ రాష్ట్ర కన్వీనర్ కృష్ణమూర్తిలు ఎంపీపీ స్వగృహానికి చేరుకుని ఆయనకు కండువా కప్పి పూలమాలవేసి కేక్‌ను కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శివన్న, బైరెడ్డిపల్లి సర్పంచ్ కొమ్ము వెంకటేష్, తబ్రోజ్ పీరు, యం. కృష్ణమూర్తి అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీలు ర్యాలీగా బైరెడ్డిపల్లి మండలం కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలికి చేరుకొని 100 కేజీల కేకును రోడ్డుపై ఉంచి వైసీపీ రాష్ట్ర కన్వీనర్, ఎంపీపీ అక్కడకు చేరుకున్న అనంతరం వారితో కేకును కట్ చేయించి ప్రజలకు పంచారు. అనంతరం సర్పంచులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు ఆయనకు కండువా కప్పి పూలమాలవేసి ఘనంగా సత్కారం చేశారు. కార్యక్రమానికి వచ్చిన వారందరికీ ఆగస్తి జూనియర్, డిగ్రీ కాలేజ్‌లో విందు భోజనం నిర్వహిం చారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీవో రాజేంద్ర రామ, రెవెన్యూ వీఆర్‌ఏలు, సచివాలయ సిబ్బంది, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు సచివాలయ కన్వీనర్ కార్తికేయన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయంలో శనివారం సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కేఎస్ శ్రీధర్, వాసు ఆధ్వర్యంలో 49 రోజులు సుదర్శన హోమం జరిపించాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 40వ రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగా పాచిగుంట గ్రామస్తులైన మురళి దంపతులు, చిత్తూరు పట్టణానికి చెందిన సుధీర్ కుమార్ దంపతులు స్వామివారికి అభిషేక ఉభయదారులుగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటేష్ రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తూకంలో తేడాలు వస్తే చర్యలు: జేసీ



నిత్యావసర వస్తువుల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: తూకంలో తేడాలు వస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని నిత్యావసర వస్తువుల గోడౌన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే వస్తువుల వివరాలను అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రేషన్ బియ్యం, కందిపప్పు, రాగులు, చక్కెర, గోధుమ పిండి వంటి వస్తువులు రేషన్ దుకాణాలకు సరఫరా చేసే వస్తువుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం తవణం పల్లి మండలం, టీ పుత్తూరు గ్రామానికి చెందిన రేషన్ షాపు డీలర్ బాలకృష్ణతో ఆయన వస్తువుల నాణ్యతపై ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కన్నా ఎంతో నాణ్యమైన వస్తువులు ఇస్తున్నారని, ప్రతి ఒక్కరికీ ఈ వస్తువులను చేర్చాల్సిన బాధ్యత ఎండియు ఆపరేటర్ల పై ఉందని, ఒకవేళ వారు సకాలంలో ఇవ్వకపోయినా, రేషన్ దుకాణాలకు కొంత ఆప్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తూకాల విషయంలో అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని వస్తువుల సరఫరా చేసే వారికి ఆదేశించారు. బంగారుపాళ్యం గోడౌన్ పరిధిలో 100 షాపులు ఉన్నాయని, సకాలంలో రేషన్ కార్డు దారులకు పంపిణీ కార్యక్రమం గోడౌన్ నుంచి జరుగుతోందని, ఆగస్టు నెలకు సంబంధించి రెండు రోజులలో రేషన్ దుకాణాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం పూర్తి అవుతుందని తహశీల్దార్ బెన్ రాజ్ జేసీకి వివరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిఎం మోహన్ బాబు, గోడౌన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి



మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

ప్రజాశక్తి-వి.కోట: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తేనే అభివద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కుంబార్లపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బాలెంద్ర పల్లి, ముమ్మెడెర్ల పల్లి, కుంబార్ల పల్లిలో ఇంటింటికీ వెళ్లి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను వివరించి, రాబోవు ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకుంటూ మరోవైపు భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలను వివరిస్తూ ముందు కెళ్తున్నారు. అలాగే అధికార వైసీపీ అక్రమాలను, వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కార్యక్రమాలలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ రాంబాబు, నాగరాజు, నాగభూషణం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానానికి దాతలు ముందుకు రావాలి



ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ అన్నారు. శనివారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో గంగాధరనెల్లూరు మండలానికి చెందిన దాత దీపక్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని అలాంటి సేవలు అందించే వారికి స్వామివారి అభయం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ప్రజాశక్తి-పుంగనూరు: సీఎం జగన్మోహన్ రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివని రాష్ట్ర అటవీ, భూగర్భ, గనుల, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పుంగనూరు మున్సిపాలిటీలో మూడవరోజు వార్డు బాట కార్యక్రమం ఛైర్మన్ అలీమ్ అధ్యక్షతన 9, 10, 13, 24, 25, 30 వార్డులలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాకు గండికోట రిజర్వాయర్ నుండి తాగునీటి కోసం పైప్ లైన్ ద్వారా నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రతి చిన్న పల్లెకు 20వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నాం అన్నారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి కుగ్రామానికి తారు రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయంటే కేవలం జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాతనే అని చెప్పారు. పుంగనూరు పట్టణానికి ఇప్పటికే ఒక సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించుకున్నాం అన్నారు. దీనికి పైప్ లైన్ ద్వారా ఇప్పుడు నిర్మించుకున్న ఓవర్ హెడ్ ట్యాంకులకు కనెక్షన్ ఇచ్చేందుకు దాదాపు రూ.13 కోట్లు మంజూరు అయింది త్వరలో టెండర్లు పిలుస్తాం అని తెలిపారు. ఇది పూర్తి అయితే రోజువారి నీరు సరఫరా చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పుంగనూరు నియోజకవర్గ ప్రజలు ఆర్టీసీ డిపో కావాలని ఆకాంక్షించారు. ఇది చాలా రోజులు కార్యరూపం దాల్చలేదు. దీనిని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి డిపో మంజూరు చేసి ప్రజల ఆకాంక్షను నెరవేర్చారు. పట్టణంలో సుందరీకరణ పనులు చేస్తున్నాం. వాకింగ్ ట్రాక్ నిర్మించడమే కాకుండా వాకింగ్ ట్రాక్ వద్ద విశ్రాంతి తీసుకునే విధంగా దీన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు ఎన్.రెడ్డప్ప, టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, రాష్ట్ర జానపద కళల కార్పొరేషన్ ఛైర్మన్ కొండవీటి నాగభూషణం, పికెఎం ఉడా ఛైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, జిల్లా వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అమ్ము, కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వార్డుబాటలో పాల్గొన్న మంత్రి

మరింత పకడ్బందీగా రేషన్ పంపిణీ : జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:



రాష్ట్ర ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా పేదలకు నాణ్యమైన బియ్యం ఇవ్వడం జరుగుతోంది, కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ వధా చేయకూడదని, అక్రమాలకు పాల్పడకూడదని అలా చేస్తే తీవ్రమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. చౌకదుకాణాల ద్వారా సరఫరా చేసి నిత్యావసర వస్తువులు గురించి జాయింట్ కలెక్టర్ శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని జేసి ఛాంబర్‌లో సివిల్ సప్లై అధికారులు శంకరన్, మోహన్ బాబులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత పకడ్బందీగా రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రేషన్ పంపిణీ తప్పనిసరిగా ఎండియు ఆపరేటర్ల ద్వారానే జరగాలన్నారు. గోధుమ పిండి, కందిపప్పు, రాగులు, చక్కెర అత్యంత నాణ్యత కలిగినవి పంపిణీ చేస్తున్నారని, ఎవ్వరు కూడా దుర్వినియోగం చేయకుండా ఉపయోగించు కోవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా నాణ్యమైన నిత్యవసర వస్తువులను ఇవ్వడం వల్ల గర్భిణీ, బాలింతలు, పాఠశాలలో విద్యార్థులు తినడం జరుగుతోందని న్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో జరిగిన దాడుల్లో 373మెట్రిక్ టన్నుల బియ్యం పట్టుకోవడం జరిగిందని, వీటిని ఆగష్టు 8న బహిరంగ వేలం వేయడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి జిల్లా కలెక్టర్ వరకు పకడ్బందీగా తనిఖీలు చేయడం జరుగుతుందని, ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శుక్రవారం నాడు 2.5లక్షల మొక్కలు నాటడం జరిగిందనీ, ఈ మొక్కలను సంరక్షించే భాధ్యతను మన అందరూ తీసుకోవాలన్నారు.

1న మైలవరంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

తిరుపతి సిటి : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని శ్రీ కోదండ రామాలయంలో ఆగస్టు 1న ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనదలచిన గహస్తులు 9000947974, 9398418266ను సంప్రదించగలరు.

నేడు నారాయణగిరి శ్రీవారి పాదాల వద్ద ఛత్రస్థాపనోత్సవం

తిరుపతి సిటి : తిరుమలలోని నారాయణగిరి శ్రీవారి పాదాల వద్ద జూలై 30వ తేదీ ఆదివారం ఛత్రస్థాపనోత్సవం జరగనుంది. ఏడాదికోసారి ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.నారాయణగిరిలోని శ్రీవారి పాదాలకు తిరుమంజనం నిర్వహించేందుకు ఆలయంలోని బంగారు బావి నుండి తీర్థాన్ని తీసుకుంటారు. తిరుమల శ్రీవారి ఆలయంలో రెండవ గంట తర్వాత పూజ సామాగ్రి, పుష్పాలు, నైవేద్యానికి ప్రసాదాలు సిద్ధం చేసుకుంటారు. రంగనాయకుల మండపం నుండి గొడుగులతో మంగళవాయిద్యాల నడుమ మహాప్రదక్షిణంగా మేదరమిట్ట చేరుకుంటారు. తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తయిన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామివారు మొదటగా కాలు మోపినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది.

కిలివేటి సంజీవయ్యకు వ్యతిరేకంగా...

సూళ్లూరుపేటలో అసమ్మతి

గ్రూపు రాజకీయాల్లో 'గురుమూర్తి' జోక్యం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపిలో అసమ్మతి తారాస్థాయికి చేరింది. సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు వ్యతిరేకంగా అసమ్మతి నేతలు పావులు కదుపుతుండటంతో పార్టీలో చీలిక వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌కు ఎసరు పెట్టడానికి అసమ్మతి నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గం వైసీపీలో అంతర్గతంగా నాయకుల మధ్య కుమ్ములాటలు తీవ్రస్థాయిలో జరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వ్యతిరేక గ్రూపు నియోజకవర్గ ఇన్చార్జిగా తిరుపతి ఎంపీ గురుమూర్తిని తీసుకొచ్చేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రెండు సార్లు శాసనసభ్యులుగా ఉన్న కిలివేటి పార్టీ క్యాడర్‌ను కాదని తన సొంతంగా మరో గ్రూపును ప్రోత్సహించడంతో పార్టీలోని సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సూళ్లూరుపేట వైసీపీలో ఇటీవల జరిగిన ఘటనలు వర్గపోరుకు మరింత ఆజ్యం పోశాయని సొంత పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. రెండు గ్రూపులుగా ఉన్న నేతల్లో ఎంపీపీ అనిల్ రెడ్డికి ఎమ్మెల్యే అండదండలు ఉండగా.. పురపాలక ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి దూరమయ్యారు. పురపాలక వ్యవహారాలలో అనిల్ రెడ్డి తల దూర్చడంతో పాలకవర్గంలో గొడవలకు ఎమ్మెల్యే కారణంగా మారారని ఆ పార్టీ నేతలు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఛైర్మన్ శ్రీమంత్ రెడ్డిని టార్గెట్ చేసుకొని సోషల్ మీడియా కన్వీనర్ గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి బాబురెడ్డిని తొలగించడం, ఆ తర్వాత తన కష్టాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం పై ఎమ్మెల్యే బాబు రెడ్డిని పోలీసులతో కొట్టించడంపై నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. ఈ వివాదం చల్లారకముందే అదే పురపాలికలో కో ఆప్షన్ మెంబర్‌గా ఉన్న సునీల్ రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యేగా సాగిన వివాదంపై ఎమ్మెల్యే తీరును సునీల్ రెడ్డి బహిరంగంగా తూర్పారబట్టారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆదేశాలతో సునీల్ రెడ్డిని స్టేషన్‌కు రప్పించి దారుణంగా కొట్టారని వైసీపీ నేతలే ఆరోపిస్తున్నారు. సునీల్ రెడ్డి స్టేషన్‌లో ఉండగానే దబ్బల శ్రీమంత్ రెడ్డి తన వర్గంతో స్టేషన్‌ను ముట్టడించడంపై అధికారపార్టీలో చర్చకు దారితీసింది.



ఇదిలా ఉండగా ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం పూర్తి మద్దతు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తికేనని నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగుతోంది. చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం రేణిగుంట విమానాశ్రయంలో టికెట్ విషయమై నేతల ముందే చర్చించినట్లు టాక్ వినిపిస్తోంది. ఎమ్మెల్యే నుద్దేశించి సీఎం చేశారని చెబుతున్న వ్యాఖ్యలు నియోజకవర్గంలో కలకలం రేపుతున్నాయి. 'సంజీవయ్య నువ్వు నా గుండెల్లో ఉన్నావు నీకు ఏదైనా చేస్తా' అంటూ టికెట్ రాదని హెచ్చరించేలా మాట్లాడారని ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటోంది.

సూళ్లూరుపేట నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను తనకు అనుగుణంగా మార్చుకునేందుకు ఎంపీ గురుమూర్తి నేరుగా సూళ్లూరుపేట నాయకులతో టచ్‌లో ఉంటున్నట్లు తెలుస్తోంది. సునీల్ రెడ్డి వ్యవహారంలో ఎంపీ గురుమూర్తి నాయుడుపేటలో మకాం వేసి ఎస్పీ, డీఐజీలతో మాట్లాడి సునీల్ రెడ్డిని విడిపించేందుకు సహకరించారు. ఎలాగూ ఎమ్మెల్యేకి ఎంపీకి దూరం పెరిగింది.. నియోజకవర్గంలోని దాదాపు నేతలందరు ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అభ్యర్థి మార్పు అనివార్యమై అధిష్టానం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అధ్యక్షులుగా బి.మునిక్రిష్ణనాయుడు

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుపతి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం శనివారం ఎన్నికయ్యింది. అధ్యక్షులుగా బి.మునిక్రిష్ణనాయుడు, కార్యదర్శిగా ముబారక్‌బాషా, కోశాధికారిగా వినోద్ వెంకటాచలం, ఉపాధ్యక్షులుగా నాగరాజనాయుడు, ప్రదీప్‌కుమార్, చైతన్య తేజ్, అదనపు కార్యదర్శిగా కెఎన్ ప్రసాద్, మెంబర్‌షిప్ కమిటీ ఛైర్మన్‌గా డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, సర్వీస్ ఛైర్‌పర్సన్‌గా సుబ్రమణ్యం, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌పర్సన్ జి.సురేష్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ చిత్రమోహన్ ఎన్నికయ్యారు. ఓ ప్రైవేట్ హోటల్లో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన 317 ఈ మాజీ గవర్నర్ డాక్టర్ టివిఎస్ ఆర్‌కెవి ప్రసాద్ నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జగన్మాత చర్చి ఆవరణలో ఉన్నటువంటి వృద్ధాశ్రమ నిర్వాహకులకు వంట సరుకులు, బియ్యం, బిస్కట్లు క్లబ్ సబ్యులు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా వితరణ చేశారు. రెండోసారి అధ్యక్షులుగా ఎన్నికైన మునికృష్ణనాయుడు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ స్థాపించి 59 సంవత్సరాలు పూర్తయ్యిందని తెలిపారు. 60వ అధ్యక్షునిగా ఎన్నిక కావడం తన పూర్వజన్మ సుకృతమని తెలిపారు. ఈ ఏడాది రూరల్ ప్రాంతాల్లోనూ విరివిగా మెడికల్ క్యాంపులు, డయాబెటిక్, ఐస్క్రీనింగ్ పరీక్షలు, క్యాన్సర్‌పై అవగాహన, దంత పరీక్షలు, గుండె సంబంధిత క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్‌సిటీ అధ్యక్షులు సోమయ్య, లయన్స్‌క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్‌హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, పీలేరు క్లబ్ అధ్యక్షులు సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఒలంపిక్ అసోసియేషన్ ఛైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఛైర్మన్ శాంత రెడ్డి అమెరికా పర్యటన దిగ్విజయంగా పూర్తి చేసుకొని భారతదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీధర్ పుష్పగుచ్చాన్ని అందించి స్వాగతం పలికారు. వరదరాజ నగర్ లోని శాంతా రెడ్డి నివాసంలో శనివారం ఆమెను కలిసిన వారు మాట్లాడుతూ ఆగస్టు 29వ తేదీ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా, తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ అంశాలలో క్రీడా పోటీల్ని నిర్వహించనున్నామని, బహుమతి ప్రధానం ఆరోజు చేయనున్నామని తెలిపారు. అనంతరం ఆమెకి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సాయికుమార్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నేడు విజయవాడలో ధార్మిక కథల పోటీలు

తిరుపతి సిటి : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జూలై 30వ తేదీ విజయవాడలో విద్యార్థులకు జిల్లా స్థాయి రామాయణ, మహాభారత, భాగవత, ఇతిహాసాల మీద కథలు చెప్పే పోటీలు నిర్వహించనున్నారు విజయవాడ ఏలూరు రోడ్డు చుట్టుగుంట సెంటర్ బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న లైన్స్ క్లబ్ ఆఫ్ ఈస్ట్ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు కథల పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో మొదటి విభాగంలో 1 నుండి 5వ తరగతి విద్యార్థులకు, రెండవ విభాగంలో 6 నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు పోటీలు జరగనున్నాయి. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తతీయ నగదు బహుమతులు ప్రశంసా పత్రాల్ను అందజేస్తారు. ఆసక్తిగల విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్టీఆర్ జిల్లా టీటీడీ జిల్లా ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్- 7032255499 ను సంప్రదించాలని విజప్తి చేశారు.

తెలుగుభాషకు నిలువెత్తురూపం.. సినారె



సినారె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు

ప్రజాశక్తి-పలమనేరు: తెలుగుభాషకు నిలువెత్తురూపం డాక్టర్ సి.నారాయణ రెడ్డి అని తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి అధ్యక్షులు పి.తులసినాధం నాయుడు పేర్కొన్నారు. శనివారం సినారె జయంతి సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్వర్యంలో కళామందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు జ్ఞానపీఠ్ అవార్డును తెచ్చిపెట్టిన ధీశాలి సినారె అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతిగా, రాజ్యసభ సభ్యునిగా విశేష సేవలందించారన్నారు. తెలుగు జాతి మనది నిండుగ తెలుగు జాతి మనది అని తెలుగు జాతి వైభవాన్ని చాటి చెప్పారన్నారు. గజల్స్ రచనలో ఎంతోమందికి మార్గదర్శకుడు అయ్యారన్నారు. సినారె రచించిన సినీ గీతాలు కూడా బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, ఉమ, గురుమూర్తి, శివశంకర్ రెడ్డి, నరేంద్ర, శీతారామయ్య, భూపాలరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న 'ఫెయిల్యూర్' కాలనీలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిర్మితమవుతున్న జగనన్న కాలనీలన్నీ ఫెయిల్యూర్ కాలనీలేనని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట విమర్శించారు. జనసేన నాయకులు శనివారం నియోజకవర్గ పరిధిలో నిర్మితమవుతున్న జగనన్న కాలనీలను పరిశీలించారు. జియో టాగింగ్‌తో ఇలా నిర్మాణాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. రాజీవ్ నగర్ లో రెండువేల ఇల్లు మంజూరు చేస్తే కేవలం 10 ఇళ్లు, చిందేపల్లి 8 వేల ఇళ్లకు గాను జీరో ఇళ్లు, ఊరందూరు వద్ద సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంఖుస్థాపన చేసి 13 వేల ఇళ్లకు గాను 100 ఇళ్లు సైతం పూర్తి కాలేదన్నారు. రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద మంజూరు చేసిన 1500 ఇళ్లకు కేవలం 10 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని ఎద్దేవా చేశారు. కనీస సౌకర్యాలు లేకుంటే ప్రజలు ఎలా ఇళ్లు నిర్మించుకుంటారని, నిర్మించుకున్నా ఎలా కాపురాలు ఉండగలరని వినుత ప్రశ్నించారు. దండి రాఘవయ్య, కొప్పల గోపి, బాలాజీ, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బడుగులకు విద్య దూరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : జగనన్న పాలనలో బడుగు, బలహీన వర్గాలకు వైద్య విద్య దూరమైపోయిందని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు శనివారం విమర్శించారు. వైద్య విద్య కళాశాలలో ఉన్న సగం సీట్లను అమ్మకానికి పెట్టి పేద విద్యార్థుల ఆశలన చిదిమేశాడని ఉమేష్ ఆరోపించారు. రాజ్యాంగపరంగా తమకు దక్కిన రిజర్వేషన్ ఫలాలను బలహీన వర్గాలు అనుభవించకుండా అడ్డుకుంటున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ప్రతిభతో సంబంధం లేకుండా వైద్య కళాశాలల్లో సగం సీట్లను డబ్బున్న వాళ్ళు కొనుగోలు చేసుకునేలా నిబంధనలను మార్చి విద్యా వ్యాపారానికి తెర తీసిన జగన్మోహన్ రెడ్డి ఆధునిక పెత్తందారుడని ఉమేష్ ఎద్దేవా చేశారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వైద్య కళాశాలలో రకరకాల పేర్లతో అడ్మిషన్లను విభజించి బిసి, యస్సీ, యస్టీ వర్గాలకు వైద్య విద్యను దూరం చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తన వ్యాపారాత్మక నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని, ప్రతిభ ఆధారంగా అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉమేష్ డిమాండ్ చేశారు.

వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని లూటీ చేస్తోంది



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి-పుంగనూరు: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని లూటీ చేస్తూ, రౌడీయిజం, దౌర్జన్యాలే వారి అభివృద్ధికి సూచకంగా నిలుస్తున్నాయని బీసీవైపీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామ చంద్ర యాదవ్ ఆరోపించారు. శనివారం స్థానిక ఎల్ఐసి కాలనీలోని సునంద నిలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ పథకాల పేరుతో దోపిడీ తప్పితే పేద ప్రజలకు చేస్తున్నది ఏమీ లేదన్నారు. ఈ రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించాలంటే పెట్టుబడిలో 20 శాతం కప్పం కడితే అనుమతులు ఉంటాయని, దీంతో పారిశ్రామికవేత్తలందరూ ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవడం జరుగుతుందన్నారు. చివరికి కొత్త సినిమాలు విడుదలైన వాటిలో కూడా 20 శాతం కమిషన్ ఇస్తేనే మన రాష్ట్రంలో సినిమాలు ఆడే పరిస్థితిలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న 40 దేవాలయాల నుండి కప్పం చెల్లిస్తున్నట్లు వైసిపి నాయకులు చెబుతున్నారని ఆరోపించారు. రైతాంగానికి, యువతకు మేలు చేయడం లేదని, ఆర్థిక అభివద్ధికి ఎలాంటి ప్రయత్నాలు లేకుండా ఉన్నది దోచుకోవడం మాత్రమే జరుగుతుందన్నారు. 2019లో వైసిపి అధికారంలో వచ్చినప్పటి నుంచి దేశ చరిత్రలో ఎక్కడ ఇలాంటి దౌర్జన్యాలు, రౌడీయిజం, దాడులు, బెదిరింపులు జరగలేదన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న పోరాటం జీర్ణించుకోలేక వారిపై తప్పుడు కేసులు ఆర్థిక మూలాలను దెబ్బతీస్తూ కుటుంబ సభ్యులను బెదిరిస్తూ ఇబ్బందులు పెడుతున్నారు. చిత్తూరు జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రాజకీయ లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్న విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. కార్యక్రమంలో చనకంటి సాంబమూర్తి, సోమల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల మంజూరులో మడమ తిప్పిన వైసీపీ



ప్రజాశక్తి-నగరి: కొత్త పింఛన్ల మంజూరులో వైసీపీ ప్రభుత్వం మడమ తిప్పిందని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ ఎద్దేవా చేశారు. శనివారం ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతి నెలా ఇస్తున్న కొత్త పింఛన్లకు మంగళం పాడి, ఆర్నెల్లకు ఒకసారి మాత్రమే మంజూరు చేస్తున్న వైసీపీ ప్రభుత్వం జులైలో ఇవ్వాల్సిన కొత్త పింఛన్లను ఇవ్వకుండా చేతులెత్తేసిందని ఆరోపించారు. ఇప్పటికే నిబంధనల పేరుతో ప్రతి నెలా పింఛన్లను తొలగించి పేదల కడుపుకొడుతున్న జగన్ సర్కార్, కొత్త పింఛన్ల మంజూరులోను జాప్యం చేస్తోందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటికే 20 వేల మంది కొత్త పింఛన్ల కోసం ధరఖాస్తు చేసి ఎదురుచూస్తున్నారని, వీరిలో వద్ధులు, వితంతవులు, దివ్యాంగులు వున్నారని గుర్తు చేశారు. వీరికి ప్రభుత్వం ఇచ్చిన గడువు ప్రకారం జూలై నెలలోనే పింఛన్లు రావాలస్సివుందన్నారు. అన్నీ వడపోతలు పూర్తి అయినా వేచి చూడాల్సిన పరిస్థితి. ఆగస్ట్ నెల వస్తున్న వచ్చే పరిస్థితి కనబడడం లేదని ఎద్దేవా చేశారు. 6 నెలలకు ఒకసారి మంజూరు చేసే నిబంధన పెట్టడంతో ఒక్కో లబ్దిదారుడు రు.20 వేల వరకు కోల్పోతున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాదు, అభివద్ధి చేయలేని అసమర్ధ ప్రభుత్వాన్ని సాగనంపి, తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని చంద్రబాబునాయుడును సీఎం చేసి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి ప్రత్యేక పూజలు



శ్రీకృష్ణదేవ రాయల విగ్రహానికి పూలమాల వేసిన డీకే చైతన్య

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని పిజెసి కల్యాణ మండపంలో శనివారం డీకే ఆది కేశవులు నాయుడు మనవరాలు డీకే చైతన్యను పలమనేరు (బాస్) బలిజ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు సుధాకర్, ప్రెసిడెంట్ పిజెసి బాబు, కార్యదర్శి కిరణ్ కుమార్, మాజీ గంగమ్మ గుడి ఛైర్మన్ ఏకే మూర్తి, చెంచు రెడ్డి, సుబ్బ నాగయ్య, వీరి ఆధ్వర్యంలో ఆమెను ఆహ్వానించారు. ఆమె మొట్టమొదటిసారిగా బలిజ కుటుంబ సభ్యులతో పి జె సి కళ్యాణ మండపంలో అందరిని పరిచయం చేసుకున్నారు. అనంతరం అక్కడి నుండి నేరుగా స్థానిక పట్టణంలోని సరస్వతి కేఫ్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణదేవ రాయల విగ్రహం వద్దకు చేరుకొని విగ్రహానికి భారీ పూల మాల వేసి పూజలు చేపట్టారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి స్వర్గీయ చిత్తూరు జిల్లా మాజీ ఎంపీ ఆదికేశవులు నాయుడు చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా తాను కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో టెంకాయ చెట్టును నాటి నీరు పోశారు. అనంతరం తిరుపతి దగ్గరున్న తిరుచానూరు అమ్మవారిని దర్శించుకోవడానికి బయలుదేరారు. ఆమెకు పలువురు బలిజ సంఘం కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పగడాల ప్రవీణ్, జిల్లేడు అరుణ్ కుమార్, జయశంకర్, డాక్టర్ జనార్ధన్, మాజీ గంగమ్మ గుడి ఛైర్మన్ అమ్ములు, సింగిల్ విండో ప్రెసిడెంట్ రఘునాథ్, కౌన్సిలర్ రవి తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదాల అంచున బ్యానర్ల నిర్వహణ



తెగి కింద పడిన బ్యానర్

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలో బ్యానర్ల నిర్వహణ ప్రమాదాల అంచుకు చేరుతుంది. నిత్యం రద్దీగా ఉండే చిత్తూరు బస్ స్టాప్ మిట్టపైన బ్యానర్స్ కట్టే ఎస్ఎస్ డిజిటల్ నిర్వాహకులు ప్రజల ప్రాణాలంటే లెక్క లేకుండా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గాలి ఎక్కువగా వీస్తున్నందున, సరైన నాణ్యమైన బైండింగ్స్ వైర్లను వినియోగించకుండా నాణ్యత లేని వాటిని వినియోగించడంతో శనివారం గాలికి ఒకే సారి తెగి కింద పడింది. అదష్టవశాత్తు ఎవరికి ఏమీ జరగలేదు. ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాలలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు జరిగితే అప్పుడు ఏం చేస్తారని, ఇలాంటి సంఘటనలపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వైఎస్ఆర్టీయూసీ నాయకులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్ఆర్టీయూసీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్టీయూసీ బలోపేతానికి సహకరిస్తామని తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీకి ట్రేడ్ యూనియన్ చాలా ముఖ్యమని.. కార్మికులు చైతన్యవంతులు అయితే రాజకీయాలను శాసిస్తారన్నారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైయస్సార్ కార్మిక సంఘం జోనల్ ఇన్‌ఛార్జి నారప రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఉపేంద్ర, మండ్ల రాజేష్ పాల్గొన్నారు.

బాలల అక్రమ రవాణాపై అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఇన్ స్పెక్టర్ సుధాకర్‌రావు

ప్రజాశక్తి-రేణిగుంట: బాలల అక్రమ రవాణాపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని రేణిగుంట ఆర్పీఎఫ్ ఇన్స్పెక్టర్ సుధాకర్‌రావు తెలిపారు. శనివారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్రపంచ బాలల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై) సంస్థ, బెంగళూరు వారి సహకారంతో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రగతి సిబ్బంది మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా ఉన్న వారిని గుర్తిస్తే పోలీస్ కంట్రోల్ రూమ్-100, దిశా హెల్ప్ లైన్-1056, చైల్డ్ హెల్ప్ లైన్ -1098 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రేణిగుంట రైల్వే సిబ్బంది, రైల్వే పోలీసులు, ప్రగతి సిబ్బంది జయలక్ష్మి, సుభాష్, సుమలత, కోటేశ్వరి పాల్గొన్నారు.

పరమేశ్వరమంగళంలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహశీల్దారు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మండలంలోని పరమేశ్వరమంగళంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఉన్నత పాఠశాలకు కేటాయించిన స్థలంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించి నిర్మాణాలు చేస్తుండటంతో శనివారం తహశీల్దారు పరమేశ్వరస్వామి, డీటీ స్వరూపరాణి చేరుకుని ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే తిరుమలకుప్పంలో కాలువ పోరంబోకులో 0.56 సెంట్లు పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో తొలగించారు. వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల

కష్టాలు వర్ణణాతీతం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అడవి బిడ్డలా రాత్రింబవళ్లు అడవుల్లో తిరగుతూ విధులు నిర్వహించే కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కష్టాలు వర్ణణాతీతం. దినదిన గండంగా విధులు నిర్వహిస్తూ చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నారు. ఎక్కడ ఏ పాము పొంచి కాటువేస్తుందో, ఏనుగుల గుంపుదాడిచేసి తొక్కేస్తుందో, ఏ రూపంలో ప్రమాదం ముంచుకొస్తుందోన్న భయంతో బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్న ఫారెస్టు కాంట్రక్టు ఉద్యోగులు. రోజుకు 24 గంటలు పని చేసినా నెల తిరిగాక వచ్చే జీతం కేవలం రూ.7,100 మాత్రమే. అడవుల్లో తిరుగుతూ విధులు నిర్వహిస్తున్న ఫారెస్టు కాంట్రాక్టు ఉద్యోగులు ప్రమాదాల బారిన పడి మృతి చెందితే ఒక్కరూపాయి వచ్చే పరిస్థితి లేదు. ఇలా ప్రమాదాల్లో మృతి చెందిన కాంట్రాక్టు ఉద్యోగులు అంత్యక్రియల కోసం వెతుకులాడుకొనే పరిస్థితి ఉంది. ఇటీవల జిల్లాలోని హార్సీలీహిల్స్‌లో వేవన అనే కాంట్రాక్టు ఉద్యోగి విధినిర్వహణలో ఉండగా ఏనుగు దాడిలో మృత్యువాత పడ్డాడు. ఇతడి కుటుంబానికి అటవీశాఖ శాశ్వత ఉద్యోగులు రూ. 1,60,000, కాంట్రాక్టు ఉద్యోగులు 13, 000 ఆర్థిక సాయం అందించారు. మొత్తంగా రూ.1. 73 లక్షలు బాధిత కుటుంబానికి అందించారు.

దిక్కులేని చావే....

అటవీశాఖలో పని చేస్తున్న పాముకాటు, ఏనుగులదాడి, బాబుపేలుడు ఇతర ప్రమాదాల్లో మరణిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల చావులు దిక్కులేని చావులుగా మిగిలిపోతున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నుండీ నేటి వరకు అంటే ఏ ఏడాది జనవరి 29వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా 15 మందికి పైగా విధి నిర్వహనలో మృతువాత పడిన్నట్లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు చెబుతున్నారు.



అటవీశాఖ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఇలా ప్రమాదాల్లో మరణిస్తున్న వారి కుటుంబాలకు ప్రభుత్వం నుండీ ఎలాంటి సాయం అందడం లేదు. పేరుకే కాంట్రాక్టు ఉద్యోగులు వీరి ఎలాంటి ఉద్యోగ భద్రత లేదు. ఇచ్చే అరకొర జీతం నెలనెల అందే పరిస్థతిలేదు. జీఎస్‌టి పేరుతో 18శాతం జీతంలో కోతలు, ఇఎస్ఐ, పీఎఫ్ పేరుతో జీతంలో కొత విధిస్తున్నా ఏజేంట్ జమచేస్తున్నాడా లేద తెలియని పరిస్థితి. రాష్ట్ర వ్యాప్తంగా 16వందల మంది అటవీశాఖలో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి అటవిశాఖ సర్కల్ పరిధిలో డ్రైవర్లు, డేటాఎంట్రీ అపరేటర్లు 595, చెక్‌పోస్టు విధులు నిర్వహించే కార్మికులు 312, అడవుల్లో తిరుగుతూ విధులు నిర్వహించే సిబ్బంది 419 మంది ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూస్తే అటవీశాఖలో శాశ్వత ఉద్యోగుల కంటే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే ఎక్కవగా ఉన్నారు.

11 ఏళ్లుగా పెరగని జీతం

అటవీశాఖలో 2010 నుండీ ఉద్యోగ నియామకాలు ఆగిపోయాయి. అడవుల్లో కాపలా, చెక్‌పోస్టుల వద్ద నిఘా, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వాహన డ్రైవర్లు మొత్తం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే నెట్టుకొస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులు చేయాల్సిన పనులను ఔట్‌సోర్సింగ్ సిబ్బందే చేయాల్సి వస్తుంది. ఏజేన్సీ ద్వారా నియమితులై విధులు నిర్వహిస్తున్న వీరు నెలకు రూ. 7,100 చాలీచాలని జీతాలతో అల్లాడుతున్నారు. అష్టకష్టాలు పడుతూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న అటవిశాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం నెలకు రూ. 21వేలు, ఎపి కార్పోరేషన్ ఆప్ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ క్రిందకు తీసుకురావాలని అటవీశాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పట్టించుకొనే నాధుడేలేరు

విధి నిర్వహణలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందితే పట్టించుకొనే నాధుడేలేరు. రెగులర్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగలు చేతినుండీ తలాకొంత వేసుకొని బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిచాల్సి వస్తోంది. అడవుల్లో రాత్రిబవళ్ళు 24 గంటలు పని చేయాల్సి వస్తోంది. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి. విధి నిర్వహిణలో గాయపడిన, మృతువాత పడ్డా ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి. అటవిశాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు సంతోష్. కార్తిక్ ప్రభుత్వాన్ని కోరారు.

ఇన్సూరెన్స్ కూడా లేదు

రాత్రి సమయాల్లో అడవులు, అటవీ ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తే దోమలదాడికి ఒళ్లంతా పుండ్లు ఏర్పడి మాసిపోని గాయాలుగా మారుతున్నాయి. విధి నిర్వహణలో గాయాలపాలైయ్యే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు చికిత్స కోసం డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదని తిరుపతి అటవీ సర్కుల్ పరిధి ప్రస్తుతం మేగవర్ణ చక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న కార్తిక్ తెలిపారు. పుత్తూరు అటవీశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సురేష్ పుత్తూరు అటవీ ప్రాంతంలో ఓ జింకకు గాయం అయితే అడవి నుండీ బయటకు తీసుకొచ్చేందకు గోని సంచిలో చుట్టుకొని భుజంపై పెట్టుకొని తీసుకొస్తున్న సమయంలో జింక కొమ్ము తగిలి తలపై త్రీవ గాయం అయింది. నెల రోజుల పాటు చికిత్స తీసుకున్నాడు. రూ. 50వేలకుపై వైద్యం కోసం ఖర్చు చేయాల్సి వస్తుందని ఒక్క రూపాయి కూడా అటవీశాఖ నుండీ ఇవ్వాలని సురేష్ వాపోయాడు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ






గంగాధర నెల్లూరు: రక్తం చిందిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని ఆవలకొండలో మొహరం పండుగ సందర్భంగా శనివారం షియా ముస్లింలు బాధ తో పీర్లను ఊరేగించి రక్తతర్పణం చేశారు. పూర్వం యజీద్ అనే పాలకుడు ఇమామ్ హుస్సేన్ అతని కుటుంబ సభ్యులతో పాటు అనుచరులు, అభిమానులను కొంతమందిని బలిగొన్నా రు. వీరి యొక్క ప్రాణత్యాగాన్ని గుర్తించుకుంటూ, తూగుండ్రం పంచాయతీ ఆవలకొండలోని అంజుమన్ అబ్బాసియా కమిటీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మతగురువులు మౌలానా అబుదాలి, నబీల్ మిర్జా, మహమ్మద్ అలీ అధ్యక్షతన పలువురు ముస్లింలు శనివారం నల్లబట్టలు ధరించి కుటుం బంలోని పురుషులందరూ పీర్లు ఊరేగిస్తూ తమ ఛాతిపై, వీపుపై రక్తగాయాలు చేసుకుని రక్తాన్ని చిందిస్తూ ఇమామ్ హుస్సేన్ సేవలను స్మరిస్తూ, ఆవలకొండ నుంచి ఫకీరుతోట వరకు ర్యాలీ నిర్వహించారు. పీర్లుతో పాటు పలు వురు షియా ముస్లింలు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షి ణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమా నికి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంల నుం చి సైతం భారీ ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. గం గాధర నెల్లూరు ఎస్.ఐ.రామాంజనేయులు ఆధ్వ ర్యంలో పలువ్వురు ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, పోలీస్‌లు బందో బస్తు నిర్వహించారు. కార్యక్రమం లో అంజుమన్ అబ్బాసియా కమిటీ అధ్యక్షుడు ఎస్ హెచ్ నియాజ్అలీ, వైస్ ప్రెసిడెంట్ యగ్బాల్ హు స్సేన్, కార్యదర్శి రహమత్ అలీ, కోశాధికారి షాకిర్, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ గులాం హుస్సేన్, సబ్దార్ హుస్సేన్, మెహిది అలీ పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: మొహర్రం పీర్ల పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధ లతో జరుపుకొన్నారు. భాకరాపేట ఫాతీమా నగర్ గౌసియా మసీద్ ముత్తవల్లి, షాజహాన్ ఆధ్వర్యంలో పీర్ల చావిడిలో జరిగాయి.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజుల పెళ్లూరు, వెస్ట్ వరత్తూరు, కాటూరు, పీవీ కండ్రిగ, పుత్తేరి, కంచన పుత్తూరు గ్రామాలలో శనివారం మొహర్రం పండుగను ఘనంగా జరుపు కున్నారు. మసీదులలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చిన్నగొట్టిగల్లు



బుచ్చినాయుడుకండ్రిగ

దశ శత దినాలు..ఫారెస్టోళ్ల పోరాటం..!



టిటిడి వివక్షకు మరో నిదర్శనం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రాష్ట్రంలో కాని, టిటిడి చరిత్రలో కాని దశ శత దినాలు (వెయ్యి రోజులు) పైగా పోరాటం చేస్తున్న ఘనత టిటిడి ఫారెస్టు కార్మికులకే దక్కుతుంది. వాళ్లేమో టిటిడి ఆదాయంలో వాటా ఇవ్వమని అడగడం లేదు. గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. 30ఏళ్లకు పైగా పని చేస్తున్న తమను పర్మినెంట్ చేయమని కోరుతున్నారు. పైగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని, టిటిడి బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక 2019లో వైవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బోర్డు చేసిన తీర్మానాన్ని, ఈవోగా ఉన్న ధర్మారెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చమని ప్రాథేయపడుతున్నారు. కోర్టు చెప్పిన లెక్కలేదు. సిఎం ఇచ్చిన హామీకి దిక్కులేదు, బోర్డు చేసే తీర్మానానికి విలువ లేదు. ఈవో మాటకు సత్తా లేదు.

టిటిడిలో 30 ఏళ్లకు పైగా 362 మంది అటవీ కార్మికులు ఎండనక వాననక, రాత్రింబవళ్లు కష్టపడుతూ పచ్చదనాని పెంపొందిస్తూ, ప్రకృతిని రక్షిస్తూ, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు శుభ్రతను అందిస్తున్నారు. శేషాచల అడవుల్లో తరుచూ సంభవించే అగ్నిప్రమాదాలను అరికడుతూ, ఎర్రచందనం స్మగ్లర్ల దాడుల్లో గాయపడుతూ, క్రూరమృగాల బారిన పడి ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారు. గతంలో శేషాచలం అడవికి నిప్పంటుకుని బారీ స్థాయిలో అగ్నికీలలు ఎగిసి పడుతుంటే సాక్షాత్తు ఆర్మి వాళ్లు వచ్చినా, హెలిక్రాప్టర్లతో నీటిని కుమ్మరించిన, అనేక రసాయన పదార్ధాలతో మంటలను అదుపు చేయాలని చూసి చేతులెత్తేసిన సమయంలో ఈ ఫారెస్టు కార్మికులే, వళ్లంతా గోతాలు చుట్టుకుని, కేవలం చెట్లలోని పచ్చి ఆకులను చేత బట్టుకుని రాత్రింబవళ్లు కృషి చేసి, మంటలను అదుపులోకి తెచ్చిన విషయం ప్రపంచానికి ఎరుకే. అలాంటి కార్మికులకు మొదటి నుంచి అవస్థలు తప్పలేదు. కొండకు బస్సు పాసులు ఇవ్వమని, కనీసం తమను కార్మికులగా గుర్తించి ఐడి కార్డులు ఇవ్వాలని, తదితర వాటి కోసం కూడా పోరాటం చేశారు. వీళ్లకు ఉద్యోగ భరోసా కల్పించి, రెగ్యులర్ చేయాలని ఏళ్ల తరబడి వేడుకుంటూనే ఉన్నారు. దీన్ని పరిష్కరించాల్సిన టిటిడి యాజమాన్యం వివక్షను ప్రదర్శించింది. 362 మంది కార్మికులను విడగొట్టి, 162 మందిని అధికార పార్టీకి అనుకూలంగా చేసుకుని వారిని రెగ్యులర్ చేసింది. మిగిలిన 200 మందికి టైమ్ స్కేల్ ఇస్తామని చెప్పి, వారిని కొత్తగా టిటిడి ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లో కలపడం శోచనీయం. దీన్నిపై బోర్డుకు విన్నవించుకుంటే అందులో చేసిన తీర్మానాన్ని కూడా అమలు చేయలేదు. ఏడాది పాటు ఎదురు చూసిన కార్మికులు విదిలేని పరిస్థితుల్లో 2020 నవంబరు 20వ తేది రిలే దీక్షలకు పూనుకున్నారు. అప్పటి నుంచి తరుచూ వినూత్న నిరసనలు తెలియజేస్తూనే ఉన్నారు. అయినా అధికారుల్లో స్పందన కరువైంది. ధర్మాన్ని రక్షించండి ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందని ప్రతి నిత్యం ప్రచారం చేసే చోట అధర్మం రాజ్యమేలుతోంది. అటవీ విభాగంలో 30 ఏళ్లగా పని చేస్తున్న 362 మంది కార్మికుల్లో జూనియర్లను పర్మినెంట్ చేసి, సీనియర్లను వీధులు పాలు చేసిన దారుణం టిటిడిలోనే కనిపిస్తోంది. ముగ్గురు ఐఏఎస్ అధికారులు, ఒక ఏపిఎస్ అధికారి, అత్యున్నత వ్యక్తులతో నిండిన పాలకమండలి వెరసి, సగటు అటవీ కార్మికుని గొంతు కోఏసినట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే సమాధానం చెప్పే నాధుడే కరువయ్యాడు.

ధర్మారెడ్డి ఇదేనా ధర్మం...!

టిటిడి ఈవోగా ధర్మారెడ్డి బాధ్యతలు తీసుకుని 14 నెలలు పూర్తి అవుతోంది. ఈవోగా బాధ్యతులు తీసుకున్న కొద్ది రోజులకే తిరుపతి పద్మావతి అతిథిగృహంలో బాధిత అటవీ కార్మికులతో ఈవో మాట్లాడారు. టిటిడితో తన ముందున్న ప్రధాన సమస్యలు రెండే. ఒకటి శాశ్వత ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు, రెండోవది అటవీ కార్మికులు సమస్యే అని కార్మికులందరి సమక్షంలో వెల్లడించారు. కార్మికులకు టైం స్కేలు ఇవ్వడం తన చేతిలో ఉందని, పర్మినెంటు ప్రభుత్వం చేయాలని అన్నారు. సాక్షాత్తు ఈవో హామీ ఇచ్చి ఏడాదవుతున్నా ఇప్పటి వరకు 200 మంది కార్మికులకు పర్మినెంటు కాలేదు, టైం స్కేల్ అమలు చేయలేదు. ఇదేనా ధర్మమంటే. బోర్డు తీర్మానం మేరకు టైం స్కేల్ అమలు కావాల్సిన అటవీ కార్మికులు 200 మందికి అది అమలు చేయకపోగా రివర్షన్‌లో కార్పొరేషన్‌లోకి విలీనం చేయడం ఎంత వరకు సబబో చైర్మన్ వైవి.సుబ్బారెడ్డికే తెలియాలి. టిటిడిలో అధర్మం రాజ్యమేలుతోంది, టిటిడి అటవీ కార్మికుల జీవితాలతో చెలగాటమాడవద్దని, అందరికీ ఒకే న్యాయం చేయమని కోరుతూ టిటిడి అటవీ కార్మికులు చేపట్టిన పోరాటం ఈ నెల 27వ తేదితో వెయ్యి రోజులను పూర్తి చేసుకుంది. అయినా అధికారులు కనికరం, జాలి, దయ లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా చట్టాలను, రాజ్యాంగాన్ని, కార్మికుల హక్కులను గౌరవించి టిటిడి ఉన్నతాధికారులు మిగిలిని 200 మంది ఫారెస్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని అనేక ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్ధి సంఘాలు, రాజకీయ పార్టీలు, మేధావులు కోరుతున్నారు. ఇప్పటికైనా టిటిడి న్యాయబద్దంగా ఆలోచించి, కార్మికులు జీవితాల్లో వెలుగు నింపుతుందని ఆశిద్దాం.

నేడు పక్కా కమర్షియల్ ప్రయోగం

పిఎస్ఎల్వి సి-56 రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం

షార్‌లో కౌంట్‌డౌన్ ప్రారంభం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట




తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి ఇస్రో మరో వాణిజ్య పరమైన రాకెట్ ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది. ఆదివారం ఉదయం 6:31 గంటలకు మొదటి ప్రయోగ వేదిక పై నుండి పిఎస్ఎల్వి సి-56 (పోలార్ సాటిలైట్ లాంచ్ వెహికల్) రాకెట్ ద్వారా సింగపూర్ కు చెందిన డీఎస్-సార్ అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు.దీంతో పాటుగా మరో ఆరు నానో ఉపగ్రహాలనూ ప్రయోగించడానికి ఇస్రో అన్ని ఏర్పట్లు సిద్ధం చేసింది. సింగపూర్‌కు చెందిన వివిధ ప్రవేటు కంపెనీలకు సంబందించిన నానో ఉపగ్రహాలలో వేలోక్స-ఏఎం, ఆర్కేడ్,స్కూబీ, న్యూ లైన్, గాలాసియా-2, ఓఆర్బి-12, స్ట్రీడర్, ఈ ఆరు ఉపగ్రహాలు ఉన్నాయి. పిఎస్ఎల్వి సిరీస్ లో ఇది 58 వ ప్రయోగం. ఇప్పటి వరకు 57 పిఎస్ఎల్వి రాకెట్లను ప్రయోగించారు. ఇస్రో ఇప్పటి వరకూ 92 రాకెట్లను షార్ నుండి ప్రయోగించింది. అలాగే 34 ఇతర దేశాలకు సంబందించిన 424 ఉపగ్రహాలను వాణిజ్య పరంగా ప్రయోగించడం జరిగింది.

కౌంట్ డౌన్ ప్రారంభం

శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక పై నుండి ప్రయోగానికి సిద్ధంగా ఉన్న పిఎస్ఎల్వి సి-56 రాకెట్‌కు సంబందించిన కౌంట్ డౌన్‌ను ఇస్రో శనివారం ఉదయం 5 గంటల 01 నిమిషానికి ప్రారంభించింది. ఈ కౌంట్ డౌన్ 25 గంటల 31 నిమిషాల పాటు కొనసాగిన అనంతరం ఆదివారం ఉదయం 6 గంటల 31 నిమిషాలకు రాకెట్ ప్రయోగం జరుగుతుంది.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : రాయలసీమ వాసిగా ఉండి, 14 సంవత్సరాల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసి కూడా... రాయలసీమకు అన్యాయం చేసింది చంద్రబాబు నాయుడే అని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి విమర్శించారు. రాయల సీమ ప్రయోజనల కోసం ఒక్క సహాయమూ చేయలేదని ధ్వజమెత్తారు. సీమ ప్రయోజనాల కోసం జరిగిన అనేక ఉద్యమాలకు తూట్లు పొడిచిన ద్రోహిగా చంద్రబాబును ఎండగట్టారు. ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజల సాగు, తాగునీటి ప్రయోజనాలకు ఉద్దేశించిన గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ ప్రాజెక్టు లను తన స్వార్థం కోసం సమాధిచేశారని భూమన మండిపడ్డారు. రాయలసీమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్యాయం చేశారంటూ చంద్రబాబు విమర్శించడం పట్ల భూమన ఘాటుగా స్పందించారు. తిరుపతి ముత్యాల రెడ్డి పల్లెలో శనివారం ఉదయం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. భూమన కరుణాకర రెడ్డి ఇంటింటికీ పర్యటిస్తూ జగనన్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ ఆరణి సంధ్య పాల్గొన్నారు.



నేడు అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ ప్రారంభం





ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధిగాంచిన అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ 22వ బ్రాంచిని ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతి నగరంలో ఆదివారం ప్రారంభిస్తున్నామని, ఈ కార్యక్రమానికి తిరుపతి ఎంఎల్ఏ భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆ ఆసుపత్రి సిఈవో డాక్టరు రమేష్‌చంద్రా తెలిపారు. స్థానిక ఎయిర్‌బైపాస్ రోడ్డులోని రాస్ బిల్డింగ్ ఎదురుగా జయశంకర్ నగర్‌లో ఏర్పాటు చేయనున్న ఆ ఆసుపత్రి వద్ద 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ నంద్యాలలో శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తాను 18 సంవత్సరాల అనుభవంతో ఒక లక్ష కంటే ఎక్కువ క్యాటరాక్ట్ సర్జరీలు నిర్వహించామని, తన బెల్ట్ కింద 99.9 శాతం సక్సెస్ రేట్‌తో తన వైద్యుల బందంతో కలిసి, చాలా మంది జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఆసుపత్రి మేనేజరు ఈశ్వర్‌ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ రమేష్ చంద్ర తన ప్రారంభ దశల నుండి అగ్ర ర్యాంకరని, అతను ఎస్ఎస్‌సి పరీక్షల్లో స్టేట్ ర్యాంకరని, తర్వాత అతని ఎంబిబిఎస్, ఎంఎస్ ఆప్తాల్మాలజీ రెండింటిలోనూ మెరిట్ సీట్లను పొందారని తెలిపారు. ప్రపంచంలోని ఉత్తమ ప్రఖ్యాత కంటి ఆసుపత్రులు, అగర్వాల్ ఐ హాస్పిటల్ నుండి తన ఫెలోషిప్‌ను ముగించాడని తెలిపారు. ఈ నెల 30వ తేదిన తిరుపతిలో ప్రారంభమయ్యే అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవానికి రానున్న అతిథులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు.



విచ్చలవిడిగా 'నాసిరకం' విక్రయాలు

- వ్యాపారులకు కాసులు కురిపిస్తున్న అక్రమ దందాలు
- ప్రముఖ బ్రాండ్ల పేరిట జోరుగా నకిలీ వస్తువులు
- గోదాములు, దుకాణాల్లో తనిఖీల లోపమే కారణం
- అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం
- బాధ్యతారాహిత్యంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు
- గూడూరులో మరింత దారుణంగా అమ్మకాలు

ప్రజాశక్తి-గూడూరు: ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారులు బాధ్యతారాహిత్యంతో మార్కెట్లలో నకిలీ, నాసిరకం వస్తువుల విక్రయం విచ్చలవిడిగా కొనసాగుతోంది. సంభందిత అధికారులు తరుచా తనిఖీలు చేపట్టకపోవడం, అక్రమా ర్కులతో చేతులు కలపడం, అక్రమ వ్యాపారులు హద్దు మీరుతున్నారు. దీంతో అమాయక ప్రజలు నాసిరకం వస్తువులు, సామగ్రిని కొనుగోలు చేస్తూ అనారోగ్య సమస్యల బారిన పడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ సంస్కృతి గూడూరు పట్టణంలోసైతం పాకడంతో హోటళ్ళు, కిరాణ దుకాణాలు, స్వీట్స్ షాపులు, ఫ్యాన్సీ షాపులు, ఆయిల్ విక్రయాల దుకాణాలు.. ఇలా అనేక రకాల వ్యాపారాల నిర్వాహకులు విచ్చలవిడిగా నకిలీ దందాను కొనసాగిస్తున్నారు. ఇక పకడ్బందీ ప్రణాళికతో తనిఖీలు చేయాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి మమా అనిపిస్తున్నారు. గూడూరు పట్టణంలో విచ్చలవిడిగా జరుగుచున్న కల్తీ దందా మాత్రం అధికారులు తనిఖీలకు చిక్కకపోవడం గమనార్హం. అయితే తనిఖీ చేయాల్సిన ప్రాంతంలో వ్యాపారులకు ముందుగానే అవినీతి అధికారులతో వ్యాపారులకు సమాచారం అందుతుందని విమర్శలు లేకపోలేదు. నిత్యం వాడే జండుబామ్, అగర్బత్తీలు, పర్ఫ్యూమ్‌లు, చిన్న పిల్లల తిను బండారాలు, వంటనూనెలు, ఉప్పు, పప్పు వరకు అన్ని నాసిరకమయమై కల్తీ మాఫియా రాజ్యమేలుతుండగా ప్రజల ప్రాణాలను గాలికి వదిలి కల్తీ వ్యాపారుల కాసులకు కక్కుర్తి పడే తనిఖీ అధికారులు కల్తీ వస్తువుల విక్రయాలపై కేసులు నమోదు నీరుగార్చుతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇంక పట్టణంలోపుట్టగొడుగుల్లా పట్టుకొస్తున్న కిరాణ షాపులవైపు, ఫ్యాన్సీ, ఆయిల్, దుకాణాల వైపు తనిఖీ అధికారుల చూపు పోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాసిరకం, కల్తీ వస్తువులకు కేంద్రమైన గూడూరు పట్టణంలో విచ్చలవిడిగా నకిలీ వస్తువులే కాక కాలం చెల్లిన వస్తువులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అయితే ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా అధికారి యంత్రాంగం ప్రజల ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకొని నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యశస్వి పరీక్షతో రూ.2.50 లక్షల స్కాలర్‌షిప్

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యశస్వి టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సహజ సంపద సంస్థ వ్యవస్థాపకులు పోచినేని సురేష్ నాయుడు పిలుపు నిచ్చారు. వరదయ్యపాళెంలోని డైనమిక్ ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులను గుర్తించి వారి చదువులను ప్రోత్సహించడం కోసం ఈ పరీక్షను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ పరీక్షలతో దేశ వ్యాప్తంగా 30,000 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ఎంపిక చేసి రెండేళ్ల పాటు స్కాలర్‌షిప్పులు అందించనుందన్నారు. తొమ్మిదో తరగతి వారికి రూ.75, 000, ఇంటర్ ప్రథమ చదివే వారికి రూ.1,25,000 చొప్పున ఏటా స్కాలర్ షిప్ అందిం చనుందని తెలిపారు. సెప్టెంబర్



29న జరిగే ఈ పరీక్ష కోసం ఆగస్టు 8 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, ఆ తర్వాత మార్పులు, చేర్పులను 16వ తేదీ వరకు అనుమతిస్తారని వెల్లడించారు. ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్ష ఉంటుందన్నారు. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున వంద మార్కులకు పరీక్ష నిర్వహిస్తుండగా.. ఇందులో మ్యాథ్స్ కు సంబంధించి 30, జనరల్ నాలెడ్జ్ కు సంబంధించి 20, సైన్స్, సోషల్ సైన్స్ కు సంబంధించి 25 చొప్పున మార్కులకు ప్రశ్నలుంటాయన్నారు. తప్పు సమాధానాలు రాసినా నెగటివ్ మార్కులు లేవని, అలాగే ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించని ఓబీసి, ఇబీసి, డీనోటిఫైడ్, సంచార జాతుల పిల్లలకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. దరఖాస్తుతో పాటు మొబైల్ నెంబర్, ఆధార్ కార్డు, ఆధార్ కార్డ్ లింక్ చేసిన బ్యాంక్ ఖాతా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని వెల్లడించారు. https://yet.nta.ac.in లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. వివరాలకు ఫోన్‌నంబరు 9000487879 ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రంలో దళారీ వ్యవస్థ నడుస్తోంది: సంధ్య



ప్రజాశక్తి-గూడూరు: చెన్నూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మహిళా కార్యదర్శి మట్టం శ్రావణి ఆధ్వర్యంలో శనివారం మహాశక్తి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విచ్చేసిన పాశం సంధ్య మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో దళారీ వ్యవస్థ రాజ్యం నడుస్తోందని.. సామాన్యులు బతికే పరిస్థితి ఈ ప్రభుత్వం కల్పించలేకపోయిందని, నిత్యావసర సరుకుల ధరలు విచ్చలవిడిగా పెరిగాయని విమర్శించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని, గూడూరు నియోజకవర్గంలో పాశం సునీల్ కుమార్‌ను గెలిపించి రాష్ట్ర అభివద్ధికి.. నియోజకవర్గ అభివద్ధికి తోడ్పడాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుండాల లీలావతి, శ్రీదేవి, సుబ్బమ్మ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భాస్కర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, గూడూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు కల్లూరు రవి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చిట్టడువుల్లా జగనన్న కాలనీలు

ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావు



ప్రజాశక్తి-గూడూరు రూరల్: గ్రామాల్లో జగనన్న కాలనీలకు కేటాగించిన లేఅవుట్లన్నీ నిర్మాణాలు చేయక చిట్టడువుల్లా మారాయని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావు తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పట్టణ పరిధిలోని జగనన్న కాలనీ, గూడూరు మండలం పరిధిలోని తిరువెంగలయాపల్లి, కొమ్మానేటూరు, తిప్పవరప్పాడు, విందూరు గ్రామాల్లో జగనన్న కాలనీలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలకు స్థలాలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా అక్కడ మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు లేక పిచ్చిమొక్కలతో, చిట్టడువుల్లా, మద్యం బాబులకు అడ్డాగా మారాయన్నారు. ప్రజలను మోసం చేసిన విషయాన్ని గమనిస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారన్నారు. అలాగే గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ దృష్టి సారించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను అడిగినా సమాధానం చెప్పడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారని తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన కాలనీలో 4 వేలకు పైగా ఇళ్లు మంజూరైతే ఇప్పటివరకు పూర్తిస్థాయిలో 10 శాతం పూర్తి కాలేదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్, కార్యదర్శులు అవినాష్, శివ , పట్టణ జనసేన పార్టీ కార్యదర్సులు రాజశేఖర్, సాయి, మస్తాన్, ఓంకార్, విజయ్, శ్రీనాథ్, శ్రీను, వెంకటేష్, పవన్ దుర్గ పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డి సేవలు ఆదర్శనీయం




ప్రజాశక్తి-గూడూరు టౌన్: సీపీఎం పార్టీకి నిస్వార్థంగా సేవలు అందించిన ఇందుకూరు జనార్దన్‌రెడ్డి సేవలు ఆదర్శనీయమని గూడూరు సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఇందుకూరు జనార్దన్‌రెడ్డి 9వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం, సి.ఐ.టి.యు, ఆటో యూనియన్, మున్సిపల్, పురపాలక, కె.వి.పి.ఎస్, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట రామిరెడ్డి, సిఐటియు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, ప్రధాన కార్యదర్శి సురేష్, పామంజి మణి, వెంకట్రావు, బి.చంద్రయ్య, కె.వి.పి.ఎస్ పట్టణ నాయకులు అడపాల ప్రసాద్, భవన నిర్మాణ నాయకులు పుట్టా శంకరయ్య, సేలం శంకరాచారి, మున్సిపల్ కార్మిక నాయకులు బి.గోపి నాథ్, పెంచల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీటీఏ 23వ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి-పాకాల: స్థానిక ఎన్వీఎన్ ప్రాథమిక పాఠశాలలో బహుజన టీచర్స్ అసోసియేషన్ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం బీటీఏ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సలహాదారు గుండ్లపల్లి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామమూర్తి సంయుక్తంగా మాట్లాడుతూ బీటీఏ ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడి 22 సంవత్సరాలు పూర్తి చేసుకుని 23వ సంవత్సరంలో అడుగు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయుల ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేసి, ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్ల సమస్యలపై ఎనలేని కషి చేసిందని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలే కాకుండా సామాజిక సమస్యలపై నిత్యం స్పందిస్తూ వాటి పరిష్కారానికి తమవంతు పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో బీటీఏ మండల నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీ చెంగాలమ్మ బ్రహ్మోత్సవాలు



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలో శ్రీ చెంగాలమ్మ జాతర బ్రహ్మోత్సవాలు రెండోరోజు శనివారం ఘనంగా జరిగాయి. ఆలయ ఆవరణలో వేసిన గంగమ్మ ముగ్గు భక్తులను ఆకట్టుకుంది. దేవాలయంలోని అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. నవగ్రహాలకు పూజలు చేశారు.

వసతి గృహాలలో తాగునీటి కోసం వినతి



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని బాలికలు, బాలుర వసతిగృహాలలో నీటి సమస్యను తీర్చాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపకులపతి విసి ఆచార్య రాజారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బండి చలపతి, సాయి కుమార్ మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీలో నుంచి "జూ పార్క్" రోడ్డును కలుపుతూ నగరపాలక సంస్థ అధికారులు 100, 80 అడుగుల రోడ్ల ప్రతిపాదనలపై పోలీసు, ఎస్వీ యూనివర్సిటీ, టీటీడీ ఉన్నతాధికారుల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి, విద్యార్థి సంఘ నాయకులతో, సెనెట్ మెంబెర్స్ తో చర్చించి విద్యార్థుల భద్రతను దష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోకుండా, కేవలం అధికార పార్టీ వ్యక్తుల సొంత ప్రయోజనం కోసం దేవస్థానం డబ్బులు దుర్వినియోగం చేయడానికి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. దీనికి యూనివర్సిటీ ఉన్నత అధికారులు మాస్టర్ ప్లాన్ ఒప్పుకోవడానికి రెండు కోట్ల రూపాయిలు ముడుపులు ముట్టినట్లు తమకు సమాచారం ఉందన్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఎందరో విద్యార్థులకు విద్యను అందించిన, అనేకమంది టీచింగ్, నాన్ టీచింగ్, ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగస్తులతోపాటు లేడీస్, జెంట్స్ హాస్టల్స్, ఉద్యోగస్తుల క్వార్టర్స్, హెల్త్ సెంటర్ లు వున్నాయని.. ఈ రోడ్ల నిర్మాణం జరిగితే పూర్తిగా యూనివర్సిటీ కలుషితం అవుతుందని, బయట వ్యక్తులు రావడంతో అమ్మాయిలకు రక్షణ కరవవుతుందన్నారు. ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ పచ్చటి చెట్లతో, సౌండ్ పొల్యూషన్ లేకుండా ఎందరో విద్యార్థిని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మన రాష్ట్రంతో పాటు దేశ విదేశాలలో అత్యున్నత మైనటువంటి స్థానాలను అధిరోహించి ఎస్ వి యూనివర్సిటీ పరపతిని పెంచిందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షులు సుందర్, నవీన్, వినయ్, చంద్ర నాయక్, శంకర్, ప్రసాద్, తేజ, వేణు, వెంకీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా

1న కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా



ప్రజాశక్తి-తిరుపతి: కడప జిల్లాలో స్టీల్‌ప్లాంటు సాంకేతికంగా, ఆర్థికంగా లాభదాయకం కాదని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనని జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. శనివారం ఉదయం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆగస్టు ఒకటో తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, రాష్ట్ర ప్రగతి కోరుకునే వారు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, సుబ్రహ్మణ్యం, వేణు, రామకష్ణ, మల్లికార్జునరావు, గంగులప్ప, వీఎస్ మన్యం తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో విద్యార్థుల భద్రతకు ముప్పు



ప్రజాశక్తి-క్యాంపస్: దేశంలోనే పేరు గాంచిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నేడు అడ్డదిడ్డంగా మాస్టర్ రోడ్డు ప్లాన్లతో యూనివర్సిటీని సర్వనాశనం చేసేందుకు అధికార పార్టీ నాయకులు పూనుకోవడం విడ్డూరంగా ఉందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. యూనివర్సిటీ స్వేచ్ఛ, ప్రశాంతతకు భంగం కలిగించవద్దని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్వీయూ పరిపాలనా భవనం ముందు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి మాట్లాడుతూ ఎంతో పేరు, ప్రఖ్యాతులు కలిగి ప్రశాంతతకు నిలయంగా ఉండే శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వేలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతరులను ఇబ్బందులకు గురిచేసేలా మాస్టర్ ప్లాన్ రోడ్డును విశ్వవిద్యాలయంలో నిర్మించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య హుస్సేన్ కు వినతిపత్రం అందజేశారు. పచ్చని క్యాంపస్‌లో తాము సైతం వ్యతిరేకిస్తామని, ఎలాంటి అనుమతులు ఇప్పటివరకు ఇవ్వలేదని వీసీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఉరుకుంద, వర్సిటీ నాయకులు పద్మ, సునీల్, వెంకి, నవీన్, గణేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ వాతావరణాన్ని కలుషితం చేయకండి

- టీడీపీ ఇన్‌ఛార్జి మన్నూరు సుగుణమ్మ



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్‌ను తెలంగాణ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌గా మార్చకండని తిరుపతి ఇన్‌ఛార్జి మన్నూరు సుగుణమ్మ అన్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో మూడు మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మించడంపై ఉప కులపతి ఆచార్య కె.రాజారెడ్డికి తెలుగుదేశం పార్టీ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్‌లో నుంచి "జూ పార్క్" రోడ్డును కలుపుతూ నగరపాలక సంస్థ అధికారులు 100, 80 అడుగుల రోడ్ల ప్రతిపాదనలపై పోలీసు, ఎస్వీ యూనివర్సిటీ, టీటీడీ ఉన్నతాధికారుల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి సాధ్యసాధ్యాలు పరిశీలించి విద్యార్థుల భద్రతను దష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ విజ్ఞప్తి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామకష్ణ నాయుడు, నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, ఆనంద్ గౌడ్, శేషాద్రి, వివేక్, రజనీకాంత్, బుల్లెట్ రమణ, సురా సుధాకర్ రెడ్డి, ఆర్ సి మునికష్ణ, చిన్న బాబు, మహేష్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు, విశ్వనాథ్, రాజారాం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన మాయని మచ్చ

అరసం కవి సమ్మేళనంలో గళం విప్పిన కలాలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మణిపూర్‌లో జరిగిన అమానుష సంఘటనలకు నిరసనగా బాధిత ప్రజలకు సంఘీభావంగా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తిరుపతి జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం తిరుపతి నగర పరిధిలోని బైరాగిపట్టెడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో అరసం అధ్యక్షులు యువశ్రీ మురళీ అధ్యక్షతన కార్యదర్శి డాక్టర్ నెమిలేటి కిట్టన్న కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా సీనియర్ జర్నలిస్ట్ రాఘవశర్మ పాల్గొని మాట్లాడుతూ మణిపూర్‌లో వివిధ తెగలకు చెందిన ప్రజల మధ్య ఉన్న వైరుధ్యాలకు పాలకులు మతంరంగు పులమడంచే తీవ్ర కల్లోలం పుట్టి హింస చెలరేగిందన్నారు. అరసం రాష్ట్ర నాయకుడు సాకం నాగరాజ మాట్లాడుతూ కుకీ, నాగా, జోమి జాతులపై జరుగుతున్న ఆధిపత్య దాడులను ఆక్షేపిస్తూ మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడటం అత్యవసరమన్నారు. మతం కన్నా ముందు మనిషి పుట్టాడని సురేంద్ర రొడ్డ, దుఃఖ మణిపూర్ అని పల్లిపట్టు నాగరాజు, మణిపూర్ అత్యాచారాలను చూసి సిగ్గు పడదామని నాగార్జున, ఏ నాగరికతకు గర్వకారణం ఈ పాపం అని పేరూరు బాలసుబ్రమణ్యం తమ కవితలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. కవి సమ్మేళనంలో రమణ, గొడుగుచింత గోవిందయ్య, రాజేంద్ర, శాంబోల హరి, కడివేటి మునిరత్నం, మన్నవ గంగాధర ప్రసాద్, నడ్డి నారాయణ తదితరులు ఆగ్రహం, ఆవేదనాభరితమైన తమ కవితలను వినిపించారు. జర్నలిస్ట్ జీఆర్ నాయుడు మతికి రచయితలు ఘన నివాళి అర్పించారు.

వ్యాధులపై అవగాహన తప్పనిసరి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : ప్రజలు వ్యాధులపై అవగాహన పెంచుకొని జాగ్రత్త తీసుకోవాలని కేకేసీ హోమియోపతి కళాశాల డాక్టర్ శరవనన్ కుమార్ అన్నారు. శనివారం పరమేశ్వరమంగళంలోని హోమియోపతి వైద్య కళాశాలలో ఛైర్మన్ కుప్పయ్యశెట్టి, వైస్ ఛైర్మన్ నరసింహారావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెపటైటిస్, బీపీ ల గురించి వైద్యులు వివరించారు. వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్-20 ఆసియా అథ్లెటిక్స్‌లో హిమతేజ ప్రతిభ



హిమతేజను సన్మానించి అభినందిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుమారుడు హిమతేజ ఈనెల 4 నుంచి 7 వరకు సౌత్ కొరియాలో జరిగిన ఆసియా అండర్-20 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలలో భారత దేశం తరపున పాల్గొని 4ఐ100 రిలే ఈవెంట్లో మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఆ క్రీడాకారుడిని తిరుపతి జిల్లా ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి తన కార్యాలయంలో తన తండ్రి సమక్షంలో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చిల్లకూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తన కొడుకు హిమతేజ ఇష్టాన్ని నిశితంగా గమనించి ఎంతో కఠిన శిక్షణను ఇప్పించి ప్రోత్సహించారన్నారు. ఫలితంగా నేడు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ జూన్‌లో సౌత్ కొరియాలో జరిగిన ఏసియా అండర్-20 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 400(4ఐ100) రిలే ఈవెంట్లో మూడో స్థానంలో నిలిచిన జట్టు సభ్యులలో ఒకరుగా ఉండి భారతదేశానికి బ్రాంజ్ మెడల్ ను అందించారన్నారు. ఒకవైపు తనకిష్టమైన అథ్లెటిక్స్ లో శిక్షణ పొందుతూనే, మరోవైపు ఇంటర్ రెండో సంవత్సరం చదువుకుంటూ అథ్లెట్ హిమ తేజ మన దేశ పతాకాన్ని సగర్వంగా ఎగురవేశారు. భవిష్యత్తులో ఇతను ఇంకా ఎన్నో పతకాలు సాధించి భారతదేశ గౌరవాన్ని శిఖరాగ్రాన నిలపాలని కోరారు. భవిష్యత్తులో అథ్లెట్ హిమ తేజకు పోలీస్ శాఖ తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాన్ని అందించి ప్రోత్సహిస్తామని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. ప్రోత్సహించిన కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుని అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, విమల కుమారి, ముని రామయ్య, రాజేంద్ర, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రో విజయోత్సవ సంబరాలు



ప్రజాశక్తి-గూడూరు రూరల్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్, సాయి తేజ్ నటించిన బ్రో మూవీ శుక్రవారం విడుదలై హిట్ టాక్ రావడంతో మెగా అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మెగా బ్రదర్స్ సేవాసమితి ఆధ్వర్యంలో సినిమా హాల్ వద్ద కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ బ్రో సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడం ఎంతో ఆనందంగా ఉందని, ఇంతటి ఘనవిజయం అందించిన పవన్ కళ్యాణ్, సాయి తేజ్ అభిమానులకి మెగా సినిమా ప్రేక్షకుల అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. అలాగే రాబోయే 2024 ఎన్నికల్లో కూడా జనసేన పార్టీని అత్యధిక సీట్లు విజయం సాధించి అధికారంలోకి రావడం పక్కా అని వారు తెలిపారు. కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమానులు సూర్య, విష్ణు , హర్ష, సాయి ,శివ, శంకర్, మోహన్,రాకేష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో 110 జీవోను అమలు చేయండి



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అకడమిక్ కన్సల్టెంట్ గా పనిచేస్తున్న అధ్యాపకులకు 110 జిఒ అమలు చేయాలని కోరుతూ శనివారం విజయవాడ ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ధనంజయరెడ్డి కి తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో యస్.వి.యూ అకడమిక్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కల్లూరు కిశోర్ కుమార్ రెడ్డి, పి.ఆర్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు గిరిప్రసాద్ రెడ్డి , వై.యస్.ఆర్.టీచర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కేతవరపు జాలిరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 06-07-2022 తేదిన ఇచ్చిన జి.ఒ.ఆర్.టి. నెంబర్ 110 యస్.వి.యూనివర్సిటీ లో అమలుచెయ్యమని, అకాడమిక్ కన్సల్టెంట్స్ హెూదా ను అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టు గా మార్చవలసిందిగా విన్నవించారు. ధనంజయ రెడ్డి స్పందించి ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కే. హేమ చంద్రరెడ్డి ని వీలైనంత త్వరగా జి.ఒ.ఆర్.టి. నెంబర్ 110 యస్.వి.యూనివర్సిటీలో అమలుచెయ్యవలసిందిగా, అకాడమిక్ కన్సల్టెంట్స్ హోదాను అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టుగా మార్చాల్సిందిగా ఆదేశించారు. జి.ఒ.ఆర్.టి. నెంబర్ 110 ను నాగార్జున యూనివర్సిటీ 2022 ఆగస్టు 12వ తేదీన అమలు చేశారు.. అకడమిక్ కన్సల్టెంట్స్ హోదాను అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టుగా మార్పు చేశారు. జి.ఒ.ఆర్.టి. నెంబర్ 110 రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని యూనివర్సిటీలలో అమలు చేసినా కేవలం రాయలసీమ ప్రాంతంలోని యస్.వి.యూనివర్సిటీ, విక్రం సింహపురి యూనివర్సిటీ, పద్మావతి యూనివర్సిటీ, ద్రావిడ యూనివర్సిటీలలో మాత్రమే అమలు చెయ్యలేదని యస్.వి.యూనివర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేస్తూ రాయలసీమ ప్రాంతానికి చెందిన ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కే. హేమచంద్రా రెడ్డి రాయలసీమ ప్రాంతంలోని యూనివర్సిటీలకు న్యాయం చెయ్యాలని విన్నవించారు.

మహిళా వర్సిటీలో ముగిసిన శిక్షణ



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో 25 రోజుల పాటు ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇంజనీరింగ్, ఎంసీఏ విద్యార్థిను లకు ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎస్ ఆర్ కె టెక్నాలజీస్ సంస్థ ద్వారా క్యాంపస్ రిక్రూట్ మెంట్ ట్రైనింత శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి. భారతి మాట్లాడుతూ ఆప్టిట్యూడ్, ఇంగ్లీష్ భాష, సాంకేతిక విషయాలపై పట్టు సాధించాలని సూచించారు. కార్పొరేట్ కంపెనీలు తగిన సాఫ్ట్ స్కిల్స్, హార్డ్ స్కిల్స్ నైపుణ్యాలను అందిపుచ్చు కోవాలని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని మాట్లాడుతూ పరిశ్రమలకు అనుగుణంగా నిపుణులతో శిక్షణ ఇచ్చారని, వివిధ విభాగాల్లో బహుళ జాతి సంస్థల లో నియామకాలను పొందేందుకు పూర్తి స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులకు బోధించబడుతున్నాయని తెలియచేసారు. ప్లేసెమెంట్ ఆఫీసర్ ప్రొ. ఆర్ ఉష విద్యార్థినులకు ఉద్దేశించి ఉద్యోగాల కోసం ప్రయత్నించే విద్యార్థినులకు తార్కిక ఆలోచనతోనే కార్పొరేట్ కొలువులు సాధ్యమన్నారు. ఆ దిశగా ముందుకు సాగుతూ, సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సిఆర్టి ప్రాముఖ్యత, వీటిని సంపూర్ణంగా వినియోగించుకోవాలని కూడా ఆమె పేర్కొన్నారు. ఆప్టిట్యూడ్, వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్ మరియు పైథాన్ ప్రోగ్రామింగ్, కోడింగ్ వంటి అంశాలలో అంకితమైన శిక్షకులచే సమగ్రంగా శిక్షణ ఇప్పిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్స్, ప్లేస్మెంట్ మెంబర్స్ రమేష్, ప్రొఫెసర్. సుష్మ, ప్రొఫెసర్. కిశోరీ, డా. భార్గవి, మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలీసులు రక్షణ కల్పించాలి



ప్రజాశక్తి-కేవీబీపురం: తమ భూములను కబ్జా చేస్తూ తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని.. పోలీసులు తమకు రక్షణ కల్పించాలని తిమ్మసముద్రం సర్పంచ్ ఎర్రం దొరబాబునాయుడు విలేకర్లతో వాపోయారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వివరాలు ఇలా.. తిమ్మసముద్రంలో వెరైటీ పాలిస్టర్ కర్మాగారానికి సంబంధించి 43.13 ఎకరాలు సెటిల్మెంట్ పొలాలు ఉన్నాయి. ప్రస్తుతం కార్మాగారం మూసేశారు. సర్వే నం 16లో 8.64 ఎకరాల పొలాన్ని తిమ్మసముద్రం గ్రామం ఆనుకుని ఉన్న ఖాళీ భూములను వ్యవసాయ నిమిత్తం ఫ్యాక్టరీ యాజమాన్యంలో ముఖ్యల్లో ఒకరైన ఖమ్మంపాటి రామచంద్ర మూర్తి వద్ద 2016వ సంవత్సరంలో జూన్ నెల 30వ తేదీ వ్యవసాయ నిమిత్తం తన అన్నదమ్ములైన ఎర్రం మునేంద్రనాయుడు, సుధాకర్ నాయుడు, దొరబాబు నాయుడు, మనోహర్ నాయుడు నలుగురు కలిసి అగ్రిమెంట్ చేసుకొని రూ.35 లక్షలు చెల్లించడం జరిగింది. మిగతా సొమ్ముని రిజిస్ట్రేషన్ రోజున చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నామని దొరబాబు నాయుడు వెల్లడించారు. ఇక్కడే అసలైన ట్విస్ట్ జరిగింది. ఇతర ప్రాంతాలకు చెందిన బిల్డర్లు పద్మనాభరాజు, పాలగిరి మల్లికార్జున రెడ్డి , భక్తవత్సల రెడ్డి, మరి కొంతమంది 43.13 ఎకరాలను కొనుగోలు చేసుకున్నట్లు ఫేక్ డాక్యుమెంట్లు సష్టించి దౌర్జన్యంగా మా భూములను కూడా చదును చేయడానికి రావడంతో మేము అడ్డుకునందుకు దాడి చేసి దౌర్జన్యంగా మా భూమి సైతం ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారని.. దీంతో తాము పోలీసులను ఆశ్రయించామన్నారు. కోర్టు ద్వారా మా భూముల్లో ఎవరు ప్రవేశించకుండా న్యాయస్థానం స్టే ఇచ్చిందన్నారు. దీంతో కొంతకాలం మౌనంగా ఉంటూ రెండు మూడు రోజులకు ముందు తిరిగి మా భూముల్లోప్రవేశించి తమపై కేసు పెట్టారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. న్యాయస్థానం స్టే ఇచ్చినప్పుడు సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఎవరూ ప్రవేశించరాదని.. తెలిసినా మా భూముల్లో దౌర్జన్యంగా ఆక్రమించుకోవడానికి ప్రవేశిస్తున్నారని.. అడిగితే దాడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వారి నుంచి మాకు ప్రాణహాని ఉందని .. అలాంటి వారి నుంచి మాకు పోలీసులు న్యాయం చేయాలని కోరారు.

మదనపల్లిలో రైతులకు కాసుల పంట

తిరుపతి: గత కొద్ది రోజులుగా దేశంలో టమోటా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.. సామాన్యులు, మధ్య తరగతి కుటుంబాలు టమోటాలను కొనాలంటేనే భయ పడి పోతున్నారు. అయితే భూమిని నమ్ముకున్న రైతుకి అనూహ్య రీతిలో అదృష్టం వరించింది.. టమోటాల పంట సాగు చేసిన ఓ రైతు మూడు కోట్ల రూపాయలను సంపాదించాడు. వ్యవసాయంపై పెట్టుబడి ఎంతో మంది రైతులు వలసలు వెళ్లిన ఘటనతో పాటుగా, ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటి సమయంలో చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు టమోటా పంటపై ఆధారపడి పంటను సాగు చేశారు. సీజన్ మొదట్లో టమోటాకు సరైన గిట్టు బాటు ధర లేక చాలా మంది రైతులు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఈ సమయంలో ఎవరూ ఊహించని రీతిలో దేశ వ్యాప్తంగా టమోటాకు అధిక రావడంతో ఒక్క సారిగా టమోటా రైతులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో అప్పులు చేసి బతుకు జీవుడా అంటూ బతుకును సాగించిన రైతులు జోబులు గలగల మంటున్నాయి.టమాటా అధికంగా సాగయ్యే చిత్తూరు జిల్లా, సోమల మండలం, కరకమంద గ్రామానికి చెందిన చంద్రమౌళి రైతు కుటుంబం కేవలం నెల రోజుల వ్యవధిలోనే రూ.3 కోట్ల ఆదాయం పొందింది.. వేసవి అనంతరం వచ్చే పంటకు మంచి ధర వస్తుందని గుర్తించిన ఆ కుటుంబం పలు మార్లు టమోటా పంట నష్టాలు రుచి చూసిన పట్టు విడవకుండా తిరిగి అదే పంటను ఎన్నుకున్నారు.. ఏప్రిల్ లో మొక్కలు నాటి జూన్ నాటికి దిగుబడి ప్రారంభమయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో సాహూ రకం టమాటా మొక్కలు 22 ఎకరాల్లో నాటారు. కట్టెసాగు విధానంలో మల్చింగ్, సూక్ష్మ సేద్య పద్ధతులు పాటించారు.జూన్ చివరిలో దిగుబడి మొదలైంది. దిగుబడిని జిల్లాకు దగ్గరగా ఉండే కర్ణాటకలోని కోలార్ మార్కెట్ విక్రయించారు.. వేలం పాటలో 15 కిలోల పెట్టె ధర రూ. వెయ్యి నుంచి రూ. 1500 మధ్య పలికింది.. ఇప్పటి వరకు 40వేల పెట్టెలు విక్రయించగా రూ.4 కోట్లు ఆదాయం వచ్చినట్లు రైతు తెలిపారు. అందులో ఎకరాకు రూ.3 లక్షల చొప్పున పెట్టుబడి 22 ఎకరాలకు రూ.70 లక్షలు, కమిషన్ రూ.20 లక్షలు, రవాణా ఖర్చులు రూ. 10 లక్షలు పోనూ రూ.3 కోట్ల ఆదాయం వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు..గత కొద్ది రోజులుగా దేశ వ్యాప్తంగా టమోటా ధరలు మండుతున్నాయి.. దేశంలో అతిపెద్ద టమోటా మార్కెట్ లో ఒక్కటైనా మదనపల్లె టమోటా మర్కెట్ యార్డ్ నుండి వివిధ రాష్ట్రాలకు ప్రతి నిత్యం టమోటా ఎగుమతి జరుగుతుంటుంది.. ఒక్కసారిగా టమోటా ధర అధికంగా కావడంతో టమోటా రైతులు సంతోషానికి హద్దులు లేవు.. ఇక శుక్రవారం రోజులన మదనపల్లె మార్కెట్ యార్డ్ లో కిలో టమోటా 165 రూపాయలుగా పలికింది.. మరో నెల రోజుల వరకూ టమోటా ధర ఇలానే కొనసాగే అవకాశం ఉందని చెబుతున్నారు.

నారాయణ కళాశాలలో జాతీయ టెక్నికల్ ఫెస్ట్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో వన్ డే నేషనల్ లెవెల్ టెక్నికల్ ఫెస్టివల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్సనాలిటీ డెవలప్మెంట్ ట్రైనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇన్నోవేషన్ , ఇంక్యూబేషన్ , ఎంట్రప్రెన్యూర్ గురించి అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ రవిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించడంతో వారిలోని సజనాత్మకత, ప్రజెంటేషన్ స్కిల్స్ పెంపొందించడానికి ఉపయోగ పడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు పేపర్ ప్రెజంటేషన్, పోస్టర్ ప్రెజంటేషన్, క్విజ్ , రోల్ ప్లే, డిబేట్ , క్రాకింగ్ రిడిల్స్ , షార్ట్ వీడియోస్ , స్పాట్ ఈవెంట్స్ , ఫుడ్ స్టాల్స్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విశ్వక్సేనారెడ్డి, గ్యాన్ 2కె 23 ప్రోగ్రాం కన్వీనర్ వై. నీరజ, కోఆర్డినేటర్స్ జి.షణ్ముగం , యల్. గంగాదేవి , ఏవో. కొండారెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





పాలిటెక్నిక్ విద్యార్థులకు హాస్టల్ ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా హాస్టల్ భవనాన్ని ఎమ్మెల్యే వెలగపల్లి ప్రసాద్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పాలిటెక్నిక్ కలశాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి చదువుకుంటున్న విద్యార్థుల కోరిక మేరకు హాస్టల్ వసతిని కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ వ్యవస్థాపకులు బత్తిని విజయ్ కుమార్, కోడూరు మీరారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీహరి, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షులు నరసయ్య, ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







